







# బాపట్ల.. చారిత్రక ప్రసిద్ధి

బాపట్ల.. చారిత్రక ప్రసిద్ధి చెందింది. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి రాజకీయ చైతన్యం బాపట్ల సొంతం. ప్రథమాంధ్ర మహాసభలకు బీజం పడింది ఇక్కడే. చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడా అంటూ ఉగ్రూతలూగించిన గేయ రచయిత వేములపల్లి శ్రీకృష్ణకు బాపట్ల ఓటర్లు పట్టం కట్టి అసెంబ్లీలో తమ వాణిని వినిపించారు. ఇక్కడి నుంచి కోన ప్రభాకరరావు గెలిచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంత్రిగా, స్పీకర్‌గా సేవలందించారు. అంతేగాక గవర్నర్ పదవిని కూడా అందుకున్నారు. తండ్రి బాటలో ఆయన తనయుడు కోన రఘుపతి బాపట్లలో గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టి ఏపీ డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ప్రశాంతతకు నెలవుగా.. ఆధ్యాత్మికశోభకు నిలయంగా.. విద్యల కాణాచిగా.. వ్యవసాయంలో ఎన్నో నూతన ఆవిష్కరణలకు వేదికగా.. తీర ప్రాంత భద్రతలో తలమానికంగా నిలిచిన ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ కొలువైన బాపట్ల జిల్లా కేంద్రంగా ఏర్పడ్డాక తొలిసారి అసెంబ్లీ నియోజక వర్గానికి త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. దీంతో జిల్లా కేంద్రంలో పట్టు నిలుపుకునేందుకు ప్రధాన పార్టీలన్నీ సర్వశక్తులు ఒడ్డుతూ గెలుపుకోసం ప్రయత్నిస్తున్నాయి.

- రాజకీయ చైతన్యం భావపురి సొంతం
- ప్రథమాంధ్ర మహాసభలకు బీజం ఇక్కడే
- నియోజకవర్గంలో ఇప్పటికి 15 సార్లు ఎన్నికలు
- స్వాతంత్ర్య సమరయోధుడిగా ఖ్యాతికెక్కిన మంతెన

**బాపట్ల నియోజకవర్గంలో..**

| | |
|---|---|
| మొత్తం ఓట్లు : | 1,89,514 |
| పురుషులు : | 92,089 |
| మహిళలు : | 97417 |
| ఇతరులు : | 8 |

| సం. | విజేత | పార్టీ | ప్రత్యర్థి | పార్టీ | మెజార్టీ |
|---|---|---|---|---|---|
| 1952 | వేములపల్లి శ్రీకృష్ణ | సీపీఐ | ఎన్.వెంకట్రాజు | కాంగ్రెస్ | 2379 |
| 1955 | ఎం.వెంకటరాజు | కాంగ్రెస్ | వి.శ్రీకృష్ణ | సీపీఐ | 7969 |
| 1962 | కె.కోటేశ్వరరావు | స్వతంత్ర | ఎం.సత్యవతి | కాంగ్రెస్ | 1210 |
| 1967 | కోన ప్రభాకర్‌రావు | కాంగ్రెస్ | కె.వెంకటేశ్వరరావు | సీపీఎం | 15,227 |
| 1972 | కోన ప్రభాకర్‌రావు | కాంగ్రెస్ | ముప్పలనేని శేషగిరిరావు | స్వతంత్ర | 2289 |
| 1978 | కోనప్రభాకర్‌రావు | కాంగ్రెస్ | ముప్పలనేని శేషగిరిరావు | జనతా | 189 |
| 1983 | సి.విజయరామరాజు | టీడీపీ | కోన ప్రభాకర్‌రావు | కాంగ్రెస్ | 29,432 |
| 1985 | ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు | టీడీపీ | ఎం.వి.ఎస్.రాజు | స్వతంత్ర | 18,027 |
| 1989 | చీరాల గోవర్ధన్‌రెడ్డి | కాంగ్రెస్ | పి.అచ్యుతరామరాజు | టీడీపీ | 15,583 |
| 1994 | ముప్పలనేని శేషగిరిరావు | టీడీపీ | కత్తిపద్మారావు | బీఎస్‌పీ | 41,494 |
| 1999 | మంతెనఅనంతవర్మ | టీడీపీ | ముప్పలనేని శేషగిరిరావు | కాంగ్రెస్ | 13,845 |
| 2004 | గాదె వెంకటరెడ్డి | కాంగ్రెస్ | మంతెన అనంతవర్మ | టీడీపీ | 15,569 |
| 2009 | గాదె వెంకటరెడ్డి | కాంగ్రెస్ | చీరాల గోవర్ధన్‌రెడ్డి | టీడీపీ | 1363 |
| 2014 | కోన రఘుపతి | వైసీపీ | అన్నం సతీష్‌ప్రభాకర్ | టీడీపీ | 5813 |
| 2019 | కోన రఘుపతి | వైసీపీ | అన్నం సతీష్ ప్రభాకర్ | టీడీపీ | 15,192 |

## నియోజకవర్గ ముఖచిత్రం



బాపట్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆటుపోట్లతో నిండిన సముద్ర తీర ప్రాంత నియోజకవర్గమైన బాపట్ల ప్రజలు ప్రశాంతత మారుపేరుగా నిలిచారు. వివాదాలకు దూరంగా సామరస్యంగా మెలిగే ప్రజలు రాజకీయ చైతన్యం కలిగి ఉంటారు. బాపట్లకు ఎంతో చారిత్రక ప్రసిద్ధి ఉంది. స్వాతంత్ర్య ఉద్యమంలో ఎన్నో పోరాటలకు బాపట్ల వేదికగా నిలిచింది. రాజకీయంగా కూడా ఎంతో చైతన్యం కలిగిన ప్రాంతంగా బాపట్ల ప్రసిద్ధి చెందింది. స్వాతంత్ర్య సమరయోధుడిగా ఖ్యాతికెక్కిన మంతెన వెంకటరాజు 1955లో కాంగ్రెస్ తరఫున అసెంబ్లీలో అడుగుపెట్టారు. జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ పుట్టింది ఇక్కడే.

**బాపట్ల నియోజకవర్గంలో సామాజిక వర్గాల వారీగా ఓటర్ల అంచనా**

| | |
|---|---|
| రెడ్డి | 43,000 |
| ఎస్సీ(మాదిగ) | 4,000 |
| ఎస్సీ(మాల) | 38,000 |
| ముస్లి | 13,800 |
| కాపు | 15,000 |
| కమ్మ | 8,000 |
| యాదవ | 19,000 |
| గౌడ | 9,000 |
| రజక | 4,000 |
| వైశ్య | 5,000 |
| ఎస్టీ | 10,000 |
| మత్స్యకార | 5,000 |
| బ్రాహ్మణ | 3,500 |
| క్షత్రియులు | 4,000 |
| ఇతరులు | 8,214 |

**నియోజకవర్గ ప్రస్థానం.. చరిత్ర**

1794లోనే బాపట్ల తాలూకాగా ఏర్పడింది. జిల్లా ఏర్పాటు వరకు బాపట్ల తెనాలి రెవెన్యూ డివిజన్‌లో ఉండేది. 2022లో జిల్లాగా ఏర్పడ్డాక రెవెన్యూ డివిజన్‌గా అవతరించింది. బాపట్ల నియోజకవర్గ పరిధిలో బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలు ఉన్నాయి. బాపట్ల మండల పరిధిలో 28 గ్రామాలు ఉండగా, కర్లపాలెం పరిధిలో 20, పిట్టలవానిపాలెం మండల పరిధిలో 14 గ్రామాలు ఉన్నాయి. ఇక బాపట్ల ఎన్నో చారిత్రక పోరాటాలకు, ఉద్యమాలకు వేదికగా నిలిచింది. స్వాతంత్ర్యానికి పూర్వం జరిగిన ఉద్యమాలలో హరిజనులకు దేవాలయ ప్రవేశం, మంచినీటి బావుల ఏర్పాటు, వితంతు వివాహాలు బాపట్ల నుంచి మంతెన వెంకటరాజు శ్రీకారం చుట్టారు. దీంతో బాపట్ల పేరు బ్రిటీష్ వారి హయాంలోనే జాతీయ స్థాయిలో మారుమోగింది. ప్రథమాంధ్ర మహాసభలకు బీజం పడింది కూడా ఇక్కడే. 1913 మేలో నిర్వహించిన ఈ సమావేశాలకు బాపట్ల టౌన్‌హాలు వేదికగా నిలిచింది. 1916లో హోంరూల్ ఉద్యమంపై బ్రిటీష్ దమన నీతిని వ్యతిరేకిస్తూ భారీ సభ నిర్వహించారు.

**వరి, ఆక్వాతో పాటు మత్స్యకారులు..**

వ్యవసాయంగా ఈ ప్రాంతం ఎక్కువగా వరి పంటపైనే ఆధారపడి ఉంది. బాపట్ల మండల పరిధిలో ఎక్కువగా వరి సాగు చేస్తుండగా, కర్లపాలెం మండల పరిధిలో ఆక్వా సాగు ఎక్కువగా జరుగుతుంది. సముద్ర తీర ప్రాంతం ఎక్కువగా ఉండడంతో చేపల వేటపై ఆధారపడి బతుకీడ్చే మత్స్యకారుల సంఖ్య గణనీయంగానే ఉంది. ఆక్వారంగానికి సంబంధించి హేచరీలు, ప్రాసెసింగ్ యూనిట్లు ఎక్కువగా ఉండడంతో వేల మందికి ఉపాధి కల్పిస్తున్న రంగంగా ఆక్వా ఉంటోంది. ఏటా వేలకోట్ల టర్నోవర్ ఆక్వా రంగం మీదే ఆధారపడి జరుగుతుంటోంది.

**తుఫాన్ల బెడద..**

సుదూర సముద్ర తీర ప్రాంతం బాపట్ల పరిధిలో ఉండడంతో ఈ ప్రాంతానికి తుఫాన్ల బెడద ఎక్కువే. ఇప్పటి వరకు ఐదు భారీ తుఫాన్లు బాపట్ల పరిసరాల్లో తీరం దాటినట్లు సమాచారం. తాజాగా మిచౌంగ్ తుఫాన్ బాపట్ల సమీపంలోనే తీరం దాటింది. అందుకే తుఫాన్ సంకేతాలు కనబడిన ప్రతిసారి ఈ ప్రాంత పరిధిలోని రైతులు వణికిపోతుంటారు.

**పర్యాటకంగా.. ఆధ్యాత్మికంగా..**

బాపట్ల సూర్యలంక సముద్ర తీరానికి పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. కార్తీకమాసంలో అయితే లక్షల్లో భక్తులు సముద్ర స్నానానికి పోటెత్తుతారు. దీంతో ఆటవిడుపు కేంద్రంగా బాపట్ల ప్రసిద్ధికెక్కింది. తీరంలో ఉన్న సూర్యలంక ఎయిర్ ఫోర్స్ స్టేషన్ తీరం అందాలకు మరింత వన్నెలద్దినట్లు ఉంటుంది. వార సత్వ సంపదగా బాపట్ల బావన్నారాయణస్వామి ఆలయం భాసిల్లుతోం ది. భక్తులకు కొంగుబంగారంగా జిల్లెల్లమూడి అమ్మ ఉంది. బాపట్ల పట్టణంలోని సీబీజెడ్ చర్చికి ఘన చరిత్ర ఉంది. వందల ఏళ్ల పైబడి క్రైస్తవులకు ఆరాధన స్థలంగా ఖ్యాతికెక్కింది. దక్షిణ భారతదేశంలోనే ప్రప్రథమంగా స్థాపించిన వేద పాఠశాలగా శ్రీశంకర విద్యాలయం విరాజిల్లుతోంది. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు తొలిగా పిట్టలవానిపాలెం మండలం అల్లూరు గ్రా మంలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు చేసిన తర్వాతే నామినేషన్ వేయడం ఆనవాయితీగా వస్తోంది. చందోలు పరిధిలో ఉన్న శ్రీభగళాముఖి అమ్మవారి దేవస్థానానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భక్తులు తరలివస్తుంటారు. బాపట్ల నియోజకవర్గ పరిధిలో ఉన్న ప్రతి గ్రామంలో గ్రామదేవతల పేరిట తిరునాళ్లు జరగడం ఇక్కడ ప్రత్యేకత.

**తొలి వ్యవసాయ కళాశాల..**

బాపట్లలో దశాబ్దాల తరబడి సేవలందిస్తున్న వ్యవసాయ కళాశాల 1945లో మొదలైంది. అప్పట్లో ఇది దక్షిణ భారతదేశంలోనే ఏర్పడిన తొలి వ్యవసాయ కళాశాల కావడం గమనార్హం. ఎంతో మంది మట్టిలో మాణిక్యాలను అందించి ప్రపంచ చిత్రపటంలో బాపట్లను నిలపడంలో ఏజీ కళాశాల తనదైన ముద్ర వేసుకుంది. బీపీటీ - 5204 సహా ఎన్నో మేలు రకాల వంగడాలను దేశానికి అందించిన ఘనత ఈ గడ్డ సొంతం. జీడిమామిడి పరిశోధన కేంద్రంతో పాటు ఉప్పునీటి పరిశోధనాకేంద్రం కూడా బాపట్లలో ఉన్నాయి. బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీ కూడా పేరెన్నిక గల సంస్థగా వెలుగొందుతుంది.

**పెద్దల సభకు ఐదుగురు..**

శాసనమండలికి బాపట్ల నుంచి ఐదుగురు ప్రాతినిథ్యం వహించారు. 1983 దశకంలో ఎమ్మెల్సీలుగా ముప్పలనేని శేషగిరిరావు, ఆచంట రంగనాయకులు ఎన్నికయ్యారు. మూడు దశబ్దాల తర్వాత అన్నం సతీష్‌ప్రభాకర్, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు పెద్దల సభలో అడుగుపెట్టారు. శాసన మండలి చీఫ్‌విప్‌గా ప్రస్తుతం ఉమ్మారెడ్డి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇదే ప్రాంతానికి చెందిన కుంభా రవిబాబు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా గడచిన సంవత్సరం ఆగస్టులో ఎన్నికయ్యారు

- 1952 నుంచి ఇప్పటి వరకు 15 సార్లు ఎన్నికలు జరగ్గా ఏడు సార్లు కాంగ్రెస్‌కు ప్రజలు పట్టం కట్టగా, నాలుగుసార్లు టీడీపీకి, సీపీఐ, స్వతంత్రులు ఒకసారి, చివరి రెండుసార్లు వైసీపీ విజయం సాధించాయి.
- బాపట్ల ఓటర్ల తీర్పు ప్రతిసారీ ప్రత్యేకమే. 1967నుంచి బాపట్లలో ఏ పార్టీ గెలుస్తుందో ఆ పార్టీ అధికారంలోకి వస్తుందనే సెంటిమెంట్ నడిచింది. అయితే అది 2009 వరకు మాత్రమే కొనసాగింది. 2014లో బాపట్లలో వైసీపీ అభ్యర్థి కోన రఘుపతి ఎమ్మెల్యేగా విజయం సాధించగా టీడీపీ అధికారంలోకి వచ్చింది.
- చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడా అంటూ ఉగ్రూతలూగించిన గేయ రచయిత వేములపల్లి శ్రీకృష్ణ 1952లో తొలిసారి సీపీఐ తరఫున బాపట్ల ఓటర్లు పట్టం కట్టారు.
- 1967, 72, 78లలో హ్యాట్రిక్ విజయాన్ని కాంగ్రెస్ తరఫున కోన ప్రభాకరరావు నమోదు చేశారు. ఈయన మంత్రిగా, స్పీకర్‌గా, గవర్నర్‌గా సేవలందించారు. 1983 ఎన్నికల్లో టీడీపీ తరఫున సీ విజయరామరాజు విజయం సాధించి కోన ప్రభాకరరావు విజయ పరంపరకు బ్రేక్ వేశారు. 2014, 2019లో వైసీపీ తరఫున ప్రభాకరరావు తనయుడు కోన రఘుపతి గెలుపొందారు. శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా కోన రఘుపతి పనిచేశారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో వైసీపీ తరఫున కోనకే అభ్యర్థిత్వం ఖరారవగా హ్యాట్రిక్ విజయంపై కన్నేశారు.
- 2004, 2009లో కాంగ్రెస్ తరఫున విజయం సాధించిన గాదె వెంకటరెడ్డి వైఎస్ రాజశేఖరరెడ్డి క్యాబినెట్‌లో మంత్రిగా సేవలందించారు.



వేములపల్లి శ్రీకృష్ణ | ఎం. వెంకటరాజు | కొమ్మినేని వెంకటేశ్వరరావు | కోన ప్రభాకరరావు | సి. విజయరామరాజు | ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు | చీరాల గోవర్ధనరెడ్డి | ముప్పలనేని శేషగిరిరావు | మంతెన అనంతవర్మ | గాదె వెంకటరెడ్డి | కోన రఘుపతి (ప్రస్తుత ఎమ్మెల్యే, వైసీపీ తరఫున బరిలో వున్న అభ్యర్థి) | వేగేశన నరేంద్ర వర్మ (టీడీపీ తరఫున బరిలో ఉన్న అభ్యర్థి)

## దివ్యాంగ ఓటర్లకు ప్రత్యేక సదుపాయాలు

- జిల్లా ఎన్నికల అధికారి రంజిత్‌బాషా ఆదేశాలు



సమీక్షిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల, మార్చి 28: సార్వత్రిక ఎన్నికల్లో దివ్యాంగులు, వృద్ధ ఓటర్లకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. ప్రత్యేకసదుపాయాలు కల్పించే అంశంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం గురువారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ప్రతీ పోలింగ్ కేంద్రంలో దివ్యాంగులు, వృద్ధ ఓటర్లు సులభతరంగా ఓటు వేసేలా స్నేహ పూర్వక వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. జిల్లాలో 14,525 మంది దివ్యాంగ ఓటర్లు, 85 ఏళ్ల దాటిన వృద్ధ ఓటర్లు 8,633 మంది ఉన్నారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వారీగా మ్యాపింగ్ చేయాలని, పోలింగ్ కేంద్రాల వారీగా వీల్‌చైర్స్ ఏర్పాటుపై ఆర్‌వోల నుంచి నివేదిక తెప్పించుకోవాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో దివ్యాంగులు, వృద్ధుల కొరకు తప్పనిసరిగా ర్యాంప్‌లు ఏర్పాటుచేయాలన్నారు. ఎన్నికల సమయంలో దివ్యాంగులు పోలింగ్ కేంద్రాలకు వచ్చేలా వాహనాలు, ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేయాలన్నారు. హోమ్ ఓటింగ్ కోసం సాక్ష్యం యాప్‌లో ముందస్తుగా వృద్ధులు, దివ్యాంగులతో పేర్లు నమోదు చేయించాలన్నారు. సమావేశంలో డీఆర్వో సత్తిబాబు, నోడల్ అధికారి గుణశీల, డీఈవో నారాయణరావు, డీఆర్‌డీఏ పీడీ వై.పిచ్చిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**చెక్‌పోస్ట్‌ల వద్ద అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ వకుల్‌జిందాల్**

చెక్‌పోస్ట్ విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది నిత్యం అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశించారు. చెక్‌పోస్ట్‌ల్లో విధులు నిర్వహించే సిబ్బందితో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 12 చెక్‌పోస్ట్‌లను ఏర్పాటు చేశామన్నారు. నగదు, మద్యం, ఇతర సామగ్రి తరలింపును ఆయా చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అడ్డుకోవాలన్నారు. ప్రతివాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి, వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్ళేటప్పుడు 50 వేల రూపాయలకు మించి నగదు తీసుకెళ్లరాదని, అవసరమైతే ఆధారాలను చూపాలన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు వాహనాల తనిఖీ సమయంలో చెక్‌పోస్ట్ పోలీసులకు సహకరించాలని తెలిపారు.

## బాలాజీ vs వాసుబాబు

- పర్చూరు వైసీపీలో ముసలం
- యడం వ్యాఖ్యలపై నీరుకట్టు మనస్తాపం

చీరాల, మార్చి 28: వైసీపీ పర్చూరు నియోజకవర్గంలో మరో ముసలం మొదలైంది. ఆ పార్టీ అభ్యర్థి యడం బాలాజీ, కారంచేడు మండల ఎంపీపీ నీరుకట్టు వాసుబాబుల మధ్య బంధాలు బలహీనపడ్డాయి. తాజాగా వారి మధ్య విభేదాలు క్లైమాక్స్‌కు చేరాయి. గురువారం చీరాలలోని యడం బాలాజీ కార్యాలయంలో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. ఇప్పటికే చిల్లుపడ్డ పడవలా వైసీపీ పరిస్థితి ఉందని, తాజా పరిణామాలతో మునిగే పడవగా తమ పరిస్థితి మారిందని ఆ పార్టీకి చెందిన పలువురు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. కారంచేడు మండలం తిమిడిదపాడులో స్థానిక కన్వీనర్‌కు సంబంధం లేకుండా బాలాజీ ఆదేశాల మేరకు యద్దనపూడికి చెందిన మరో నాయకుడితో కార్యక్రమం జరిపించారు. దీంతో స్థానికంగా నాయకత్వం వహిస్తున్న వ్యక్తి ఈ అంశాన్ని సీరియస్‌గా పరిగణించినట్లు తెలిసింది. తమ గ్రామంలో ప్రస్తుతం కార్యక్రమం నిర్వహించిన వ్యక్తి వచ్చి ఎన్నికచేస్తాడా, లేకుంటే తాము చేయాలో తేల్చుకోవాలని బాలాజీకి అల్టిమేటం ఇచ్చినట్లు సమాచారం. విషయం తారస్థాయికి చేరుకుంటున్న తరుణంలో కారంచేడు ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు వద్ద దీనిపై మంతనాలు జరిగాయి. ఈక్రమంలో తిమిడిదపాడు నాయకుడు, మరికొందరు అసమ్మతివాదుల పక్షాన వాసు బాబు వకాల్తా పుచ్చుకుని పరిస్థితిని చక్కదిద్దేందుకు చీరాలలోని బాలాజీ కార్యాలయంలో ఆయన్ను కలిసినట్లు సమాచారం. ఈ క్రమంలో చర్చల సమయంలో బాలాజీ ఒక దశలో పార్టీలో ఉంటే ఉండండి, లేకుంటే పోండని అన్నట్లు తెలిసింది. పార్టీలో ఉండనులే వెళ్లిపోతాను అంటూ వాసుబాబు వెలుపల కు వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఈక్రమంలో వాసుబాబు, ఇతర అసమ్మతి నాయకులు, వారి అనుచరుల అడుగులు ఎలా ఉంటాయనే అంశంపై వైసీపీతో పాటు, ఇతర రాజకీయపార్టీల్లోనూ చర్చ జరుగుతోంది.

**రంజాన్ వేళలు**
ఇఫ్తార్ (సాయంత్రం) 6.25(శుక్రవారం)
సహారీ (ఉదయం) 4.48 (శనివారం )

## అధికారాలు.. కలేనా!

- పంచాయతీ కార్యదర్శులు సచివాలయాలకే పరిమితం
- జీవో వచ్చి నెల రోజులు దాటినా అమలులోకి రాని వైనం
- ఎన్నికల ప్రచారంలో వాడుకోవడానికేనా సాచివేత
- అస్తవ్యస్తంగా మారిన పంచాయతీల పనితీరు





గుంటూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వారు పేరుకే పంచాయతీ కార్యదర్శులు.. కానీ వారి విధులన్నీ సచివాలయాలకే పరిమితం. ఓ వైపు వందల సంఖ్యలో పంచాయతీలు ఖాళీగా వున్నా.. మరోవైపు అంతకు మించిన సంఖ్యలో పంచాయతీ కార్యదర్శులు కళ్లెదుటే వున్నా వారికి అధికారాలు మాత్రం దక్కలేదు. కార్యదర్శులు లేక పంచాయతీల పనితీరు పూర్తిగా దెబ్బతింటున్నా ప్రభుత్వం మాత్రం పట్టించుకోలేదు. కార్యదర్శులకు అధికారాలు ఇస్తామని 2022లోనే ప్రభుత్వం జీవో నెం. 149 విడుదల చేసిన ప్రభుత్వం జీవోను బుట్టదాఖలు చేసింది. తాజాగా ఎన్నికల హడావుడి నేపథ్యంలో ఫిబ్రవరి 15న మరోమారు జీవో ఎంఎస్. నెం.11 పేరుతో మరో జీవో విడుదల చేసింది. ఈసారి కూడా అది అమలుకు నోచుకోలేదు. దీంతో పంచాయతీ వ్యవస్థ ఎప్పుడు గాడిన పడుతుందో ఎవరికీ తెలియని పరిస్థితి ఏర్పడింది.

**నెలరోజుల క్రితమే జీవో..**

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 1230 గ్రామ సచివాలయాలు వున్నాయి. వాటిలో దాదాపు 700 మందికి పైగా గ్రేడ్ 1,2,3,4 పంచాయతీ కార్యదర్శులు వున్నారు. 2020లో సచివాలయ పరీక్షల ద్వారా మరో 568 మందిని రాష్ట్ర ప్రభుత్వం రిక్రూట్ చేసుకుంది. మొత్తంగా జిల్లావ్యాప్తంగా 1268 మందికి పైగా పంచాయతీ కార్యదర్శులున్నా గ్రామ పంచాయతీల పాలన మాత్రం గ్రేడ్ 1, 2, 3, 4 కార్యదర్శులు 700 మంది ఆధ్వర్యంలోనే సాగుతోంది. మిగిలిన పంచాయతీల్లో మాత్రం ఇన్‌చార్జి కార్యదర్శులదే అధికారం. సచివాలయ పరీక్షల ద్వారా నియమితులైన 568 మంది వున్నా ప్రభుత్వం వారికి పంచాయతీల విధులు కేటాయించలేదు. వారిని సచివాలయాలకే పరిమితం చేసి వారిని తమ ఇష్టారాజ్యంగా వాడుకుంది. అయినా ఫలితం మాత్రం దక్కలేదు.

**ఒక పంచాయతీ.. ఒక కార్యదర్శి మాటేంటి?**

జిల్లాలో వున్న 700 గ్రేడ్- 1,2,3,4 కార్యదర్శులకే పంచాయతీల బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం అందుకోసం రెండు, మూడు పంచాయతీలను కలిపి క్లస్టర్లుగా రూపొందించింది. దానికి సీనియర్ పంచాయతీ కార్యదర్శులనే ఇన్‌చార్జిగా నియమించింది. దాదాపు ఐదేళ్ల క్రితం గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శుల నియామకం జరిగినా వారికి పంచాయతీలు కేటాయించలేదు. 'ఒక పంచాయతీ- ఒక కార్యదర్శి' అన్న నియమానికి మోక్షం మాత్రం దక్కలేదు. తాజాగా విడుదల చేసిన జీవోఎంఎస్ నెం. 11 ప్రకారం గ్రామ జనభా 500 దాటిన ప్రతి పంచాయతీకి ఒక పంచాయతీ కార్యదర్శిని నియమించాలని, దాని కోసం అదనంగా మరికొన్ని గ్రామ పంచాయతీలకు డీడీవో కోడ్‌ను కొత్తగా రూపొందించాల్సి వుంది. అప్పుడు మాత్రమే పంచాయతీల పాలన గాడిన పడుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీల సంఖ్యతో సమానంగా కార్యదర్శులు వున్నా అది ఆచరణకు నోచుకోలేదు. ఉద్యోగుల ఆందోళన చేసినప్పుడల్లా తూతూ మంత్రపు చర్యలు తీసుకోవడమే తప్ప ఫలితం లేదు. 'ఒక పంచాయతీ ఒక కార్యదర్శి' దస్త్రాలపై కిందటేడాది సెప్టెంబరులోనే ముఖ్యమంత్రి సంతకం చేసినప్పటికీ ఈరోజు వరకూ అది ఆచరణకు నోచుకోలేదు. జీవోనే పెద్ద బూటకమని అర్థమై వారు ఆందోళన చేపట్టారు. ఎన్నికల సమయం సమీపిస్తుండడంతో వారిని ప్రసన్నం చేసుకోవడానికి ప్రభుత్వం సరిగ్గా ఎన్నికలకు నెలరోజుల ముందు జీవో జారీ చేసింది. కానీ ఆచరణకు మాత్రం నోచుకోలేదు.

**ఆది నుంచి గందరగోళమే..**

సచివాలయ వ్యవస్థ అమలులోకి తెచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో పరిపాలన అస్తవ్యస్తంగా తయారయిందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. పంచాయతీ కార్యదర్శులను వారి శాఖకు సంబంధించిన విధులకు పరిమితం చేయకుండా సంబంధం లేని అనేక విధులకు కేటాయిస్తున్నారు. అందులోభాగంగా దాదాపు 91 మందికి బీఎల్‌వో విధులు కేటాయించారు. ఇప్పుడు ఆ విధులకు ఆటంకం ఏర్పడుతుందన్న కారణంగా అప్పాయింటింగ్ అథారిటీగా గుంటూరు జిల్లా కలెక్టర్ జీవోను అమలు చేయకుండా ఆపారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ ఉద్యోగులకు అధికారాల కల నెరవేరలేదు. పంచాయతీలకు పట్టిన గ్రహణం వీడలేదు. పంచాయతీ కార్యదర్శులకు ఉండే డీడీవో పవర్ మాటేమోగానీ, కనీసం జనన, మరణ, వివాహ నమోదు, ధ్రువీకరణ పత్రాల జారీ, పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల వంటి ప్రాథమిక విధులు కూడా వారికి దక్కలేదు. దీంతో చాలా పంచాయతీల్లో సాధారణ పరిపాలన దెబ్బతింటోంది. కాగా పంచాయతీ కార్యదర్శులను అధికార పార్టీ వినియోగించుకోవాలనే కుట్రకోణం దీని వెనక దాగి వుందా అన్న అనుమానం పలువురు వ్యక్తంచేస్తున్నారు.

# అండర్ గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్

దిక్సూచి DIKSUCHI

ఆలిండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఏఐఎంఏ)- అండర్ గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్(యూజీఏటీ) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనిద్వారా పార్టిసిపేటింగ్ ఇన్‌స్టిట్యూట్‌లలో ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ, బీబీఏ, బీహెచ్‌ఎం, బీసీఏ, బీకాం(ఈ-కామర్స్), బీఎస్సీ(ఐటీ), బీఎఫ్‌ఐటీ, బీఐటీఎం ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు/ ప్రస్తుతం పరీక్షలు రాసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

**యూజీఏటీ వివరాలు:** దీనిని పీబీటీ(పేపర్ బేస్ట్ టెస్ట్) విధానంలో నిర్వహిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. ఇంగ్లీష్ లాంగ్వేజ్ నుంచి 40, న్యూమరికల్ అండ్ డేటా అనాలిసిస్ నుంచి 30, రీజనింగ్ అండ్ జనరల్ ఇంటెలిజెన్స్ నుంచి 30, జనరల్ నాలెడ్జ్ నుంచి 30 ప్రశ్నలు ఇస్తారు. బీహెచ్ఎం కోర్సుకు నిర్వహించే ఎగ్జామ్‌లో మాత్రం పైవాటితోపాటు సర్వీస్ ఆప్టిట్యూడ్ నుంచి 25, సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ నుంచి 25 ప్రశ్నలు అడుగుతారు. వీటికి అదనంగా గంట సమయం ఇస్తారు. ప్రతి ప్రశ్నకూ ఒక మార్కు ఉంటుంది. రుణాత్మక మార్కులు ఉన్నాయి.

- **ఆన్‌లైన్ దరఖాస్తు ఫీజు:** రూ.750
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** జూన్ 9న
- **యూజీఏటీ 2024 తేదీ:** జూన్ 16
- **వెబ్‌సైట్:** aima.in

**'దిక్సూచి' వెబ్ పేజీలో..** సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/vmwGcshలో చదవండి.




## Directorate General of Trade Remedies (DGTR) Internship Program 2024

***Description:*** Directorate General of Trade Remedies (DGTR) Internship Program 2024 is an opportunity offered by the Ministry of Commerce and Industry, Government of India to postgraduate students/research scholars. The objective of this program is to equip interested and motivated students with the knowledge and skills necessary to understand and engage in Trade Remedies Investigations and Trade Defence Measures.

***Eligibility:*** Open for postgraduate students/research scholars from recognised universities/institutions.

***Prizes & Rewards:*** A certificate of completion

***Last Date to Apply:*** Round The Year

***Application mode:*** via email or post: to the General Administration Section of DGTR

***Short Url:*** www.b4s.in/aj/DGCI1

## The Sonny and Gita Mehta Scholarship for Writers

***Description:*** The Sonny and Gita Mehta Scholarship for Writers 2024 is an opportunity offered by the University of East Anglia (UEA) to support aspiring writers from the Indian subcontinent, the Middle East or North Africa to enable them to undertake study in the Department of Literature, Drama and Creative Writing at UEA.

***Eligibility:*** Open for Indian writers who are native of India and demonstrate outstanding creative writing potential.

***Prizes & Rewards:*** A tuition fee of £28,500 and maintenance fees ***Last Date:*** 01-05-2024

***Application mode:*** Online applications only

***Short Url:*** www.b4s.in/aj/SOIS6

## ICRO Amrit Internship Programme 2024

***Description:*** ICRO Amrit Internship Programme 2024 is a joint initiative of the Indian Potash Limited (IPL) and the National Productivity Council (NPC) under the Ministry of Commerce and Industry, Government of India for Class 12 passed, final-year graduation students, graduates, and diploma holders.

***Eligibility:*** Open for Indian nationals aged between 18-45 years. Applicants must be Class 12 passed, final-year graduation students, graduates, or diploma holders with a a valid Aadhaar card.

***Prizes & Rewards:*** A monthly stipend of 6,000 and a certificate of completion

***Last Date:*** 01-10-2024 ***Application:*** Online Only

***Short Url:*** www.b4s.in/aj/ICRA1

buddy4study.com



బాలకృష్ణ నట విశ్వరూపాన్ని ప్రదర్శించిన చిత్రం 'లెజెండ్'. 2014 మార్చి 28న విడుదలైన ఈ చిత్రం అప్పట్లో ఇండస్ట్రీ రికార్డులను తిరగరాసింది. పలు అవార్డులు రివార్డులు కొల్లగొట్టింది. ఇప్పుడు మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ నెల 30న 'లెజెండ్'ను ప్రపంచవ్యాప్తంగా రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం 'లెజెండ్ బ్లాక్‌బస్టర్ టెన్ ఇయర్స్ సెలబ్రేషన్స్'ను చిత్రబృందం హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో బాలకృష్ణతో పాటు దర్శకుడు బోయపాటి శ్రీను, రామ్‌ఆచంట, గోపీ ఆచంట, కథానాయిక సోనాల్ చౌహాన్, నటీనటులు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

## మరింత ఎనర్జిటిక్‌గా ఉంటుంది



తెలుగు ప్రేక్షకులు ఎదురుచూస్తున్న మోస్ట్ అవైటెడ్ సీక్వెల్స్‌లో 'టిల్లు స్క్వేర్' ఒకటి. ఈ చిత్రం నేడు విడుదలవుతున్న సందర్భంగా హీరో సిద్ధు జొన్నలగడ్డ మీడియాతో ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

"డీజే టిల్లు విడుదల సమయంలో ప్రేక్షకుల్లో ఎలాంటి అంచనాలు లేవు. కానీ ఇప్పుడు సీక్వెల్‌పై అంచనాలు తారస్థాయిలో ఉన్నాయి. కాబట్టే కొంచెం ఒత్తిడికి లోనయ్యాం. అయితే ఆ ఒత్తిడిని జయించి బెటర్ అవుట్‌పుట్ ఇచ్చాం. ఇందులో నా పాత్ర మొదటి భాగానికి కొనసాగింపుగా ఉంటుంది. కథ కూడా కొంత కొనసాగుతుంది. కానీ మొదటి భాగంతో పోలిస్తే రెండో భాగంలో నా పాత్ర మరింత ఎనర్జిటిక్‌గా ఉంటుంది. ఎందుకంటే ఈ సారి టిల్లు మరింత పెద్ద సమస్యలో ఇరుక్కుంటాడు. చాలా షాక్‌లు, సర్‌ప్రైజ్‌లు ఉంటాయి. సినిమా అంతా నవ్వుకుంటూనే ఉంటారు. టిల్లు పాత్ర నా ఆలోచనలు, నేను చూసిన అనుభవాల నుంచి పుట్టింది. టిల్లుకి, నాకు ఒక్కటే తేడా. టిల్లు తన మనసులో ఉన్నవన్నీ బయటకు అంటాడు. నేను మనసులో అనుకుంటాను అంతే తేడా. సీక్వెల్‌లో రాధిక పాత్ర ఉంటుందో లేదో థియేటర్లో చూసి మీరే తెలుసుకోండి. ఈ సినిమాకు భీమ్స్ సంగీతం ప్రత్యేకాకర్షణ. ప్రస్తుతానికి నా ఫోకస్ అంతా 'టిల్లు స్క్వేర్' విడుదలపైనే ఉంది. పార్ట్-3 కోసం కొన్ని ఐడియాస్ ఉన్నాయి" అని చెప్పారు.

## పెళ్లి కాదు నిశ్చితార్థం?



హీరో సిద్ధార్థ్, హీరోయిన్ అదితీరావ్ హైదరీ తమ పెళ్లి విషయంలో ట్విస్ట్ ఇచ్చారు. బుధవారం వనపర్తిలోని గుడిలో వీరిద్దరి పెళ్లి జరిగినట్లు వార్తలు వచ్చాయి. అయితే అక్కడ జరిగింది పెళ్లి కాదు నిశ్చితార్థం మాత్రమే అని అదితీ, సిద్ధార్థ్ సోషల్ మీడియా వేదికగా తెలిపారు. తమ నిశ్చితార్థపు ఉంగరాలను చూపుతూ ఇద్దరూ కలసి దిగిన ఫొటోను వారు ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. 'ఆమె ఓకే చెప్పడంతో ఎంగేజ్‌మెంట్ చేసుకున్నాం' అని సిద్ధార్థ్ చెప్పారు. అయితే 'వీరిద్దరూ చెప్పినది నిజమేనా?' అనే సందేహాన్ని నెటిజన్లు వ్యక్తం చేస్తున్నారు. దీనికో కారణం ఉంది. అదితీరావ్ నటించిన 'హీరామండి: ద డైమండ్ బజార్' వెబ్‌సిరీస్ రిలీజ్‌డేట్ అనౌన్స్‌మెంట్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అదితి తప్ప నటీనటులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. యాంకర్ సచిన్ కుంబర్ మాట్లాడుతూ 'ఈ రోజు అదితీరావ్ పెళ్లి చేసుకోబోతున్నారు. అందుకే ఆమె ఈ కార్యక్రమానికి రాలేదు' అని చెప్పడం గమనార్హం. పెళ్లి విషయంలో ఈ జంట ఇంత డొంకతిరుగుడుగా వ్యవహరించడం ఎందుకో అర్థం కావడంలేదంటున్నారు నెటిజన్లు.



ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డు అందుకొన్న అల్లు అర్జున్ తాజాగా మరో ఘనతను సాధించారు. దుబాయ్‌లోని మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో ఆయన మైనపు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గురువారం జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో అల్లు అర్జున్ పాల్గొన్నారు. 'ఎంతో ఉద్విగ్నంగా ఉంది, ఇదొక గొప్ప గౌరవం' అని బన్నీ పేర్కొన్నారు.

## 21 ఏళ్ల తర్వాత మళ్లీ...



విజయ్ దేవరకొండ హీరోగా నటించిన 'ఫ్యామిలీ స్టార్' చిత్రం ట్రైలర్‌ను గురువారం ఉదయం హైదరాబాద్‌లోని శ్రీరాములు థియేటర్‌లో ప్రేక్షకుల మధ్య విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దర్శకుడు పరశురామ్ పెట్ల మాట్లాడుతూ 'ఈ సినిమాను, హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ మృణాల్ ఠాకూర్‌ను ప్రతి తెలుగు ప్రేక్షకుడు కొన్నేళ్ల పాటు గుర్తుంచుకుంటాడు. ఐ ఫీస్ట్ లాంటి సినిమా ఇది.' అని చెప్పారు. నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ "గీత గోవిందం' చిత్రం తర్వాత విజయ్, పరశురామ్ కలసి వర్క్ చేసిన సినిమా ఇది. విజయ్ పాత్ర చాలా స్పెషల్‌గా ఉంటుంది. ఇరవై ఒక్క ఏళ్ల క్రితం ఏప్రిల్ 5న విడుదలైన 'దిల్' సినిమాతో నేను నిర్మాతగా మారి, దిల్‌రాజునయ్యా. మళ్లీ ఇప్పుడు అదే ఏప్రిల్ 5న 'ఫ్యామిలీ స్టార్' చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. ఈ వేసవిలో మీకు వినోదాన్ని అందించే సినిమా ఇది. ఒక సూపర్ హిట్ చిత్రంతో మీ ముందుకు వస్తున్నాం' అని చెప్పారు.

**'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/SYCbBxz లో చదవండి.**

## అంబటి రాయుడు తండ్రికి సత్కారం



క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు తండ్రి సాంబశివరావును సత్కరిస్తున్న నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, మార్చి28: క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు తండ్రి సాంబశివరావును గురువారం మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ సత్కరించారు. మండలంలోని వెల్లలూరు గ్రామంలో భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి దేవాలయంలో జరిగిన కార్యక్రమంలో గురువారం వీరిరువురు కలుసుకున్నారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ అంబటి సాంబశివరావు ఇరువురు ఒకరినొకరు సత్కరించుకొని యోగక్షేమాలను విచారించారు. కార్యక్రమంలో అంబటి సీతారామారావు, అంబటి శ్రీను, చౌడ వసంత్, అంబటి శ్రీనివాసరావు, గనిపిశెట్టి రామకృష్ణ, ఢిల్లీ బాబు, బుచ్చిబాబు,శ్రీనివాసరావు, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



పట్టుబడిన షేక్ ఖాజా, తప్పించుకు పోయిన వ్యక్తి, స్వాధీనం చేసుకున్న దొంగనోట్లు

## మద్యం షాపులో నకిలీ నోట్ల కలకలం

- ఆరా తీయాల్సిందిపోయి నిందితుడికి అనుకూలంగా పోలీసులు

యడ్లపాడు, మార్చి 28: మండల కేంద్రమైన యడ్లపాడులో నకిలీ నోట్లు కలకలం రేపింది. ప్రభుత్వ మద్యం షాపులోనే నకిలీ నోట్లను పట్టుకోవడం విశేషం. మండలంలోని కారుచోల గ్రామానికి చెందిన ఓ వైసీపీ నాయకునికి స్వయానా సోదరుడైన షేక్ ఖాజా బుధవారం రాత్రి రూ.500 నకిలీ నోటు ఇచ్చి యడ్లపాడులోని వైన్ షాపులో మద్యం కొనుగోలు చేశాడు. కాగా గురువారం నగదును బ్యాంకులో డిపాజిట్ చేసేందుకు వెళ్ళిన వైన్ షాపు సిబ్బందికి బ్యాంకు సిబ్బంది ఒక నోటు నకిలీ నోటు అని చెప్పడంతో అవాక్కయ్యారు. గురువారం కూడా షేక్ ఖాజా మరో వ్యక్తితో కలసి నకిలీ నోట్లు తీసుకుని మద్యం కొనుగోలుకు వైన్ షాపుకు వచ్చాడు. ఈ క్రమంలో వైన్ షాపు సిబ్బంది ఖాజాను పట్టుకుని అతని వద్ద నుంచి ఏడు రూ.500 నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న నోట్లపై ఒకే సీరియల్ నంబర్లు ముద్రించి ఉండడం విశేషం. స్వాధీనం చేసుకున్న నోట్లతోపాటు ఖాజాను వైన్‌షాపు సిబ్బంది పోలీసులకు అప్పగించారు. అంతేగాకుండా అతనితోపాటు మరో గుర్తు తెలియని వ్యక్తి కూడా వచ్చాడని, ఖాజాను నిర్బంధించడంతో అతను అక్కడి నుంచి తప్పించుకు పోయినట్లుగా వైన్ షాపు సిబ్బంది చెబుతున్నారు.

కాగా.. మద్యం షాపు సిబ్బంది దొంగ నోట్లు చలామణి చేస్తూ దొరికిన వ్యక్తిని పట్టుకుని అప్పగించినా పోలీసులు మాత్రం పట్టీ పట్టనట్లు వ్యవహరించడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. నకిలీ నోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి, దీని వెనుక ఎవరైనా ఉన్నారా అన్న విషయాన్ని విచారించాల్సిన పోలీసులు నిందితునికి అనుకూలంగా అతనికి వైన్‌షాపు వద్ద దొరికినట్లుగా చెబుతున్నారు. పైగా దొరికింది ఏడు నోట్లు కాగా నాలుగు నోట్లే అని తగ్గించి చెప్పడం మరింత అనుమానాలకు దారి తీస్తోంది.



# జగనే పేదల పక్షపాతి కాదు.. కక్షపాతి

- పేదలు... పెత్తందార్లని చెప్పి నట్టేట ముంచాడు
- ఉత్తుత్తి కార్పొరేషన్లతో ఖాళీ కుర్చీలిచ్చి బీసీలకు అన్యాయం
- టిడ్కో ఇళ్లన్నీ పాడుపెట్టి పేదలకు నీడలేకుండా చేశాడు



మాట్లాడుతున్న పెమ్మసాని చంద్రశేఖర్, పక్కన నాదెండ్ల మనోహర్

తెనాలి, మార్చి 28, (ఆంధ్రజ్యోతి): జగన్‌మోహనరెడ్డీ నువ్వసలు మనిషివేనా! నీకు మళ్లీ ఓటు అడిగే హక్కుందా? పేదలు... పెత్తందార్లంటావ్... పేదల పక్షపాతినంటావ్! నువ్వు పేదలపాలిట నరరూప భూతానివి. పక్షపాతి కాదు... కక్షపాతివి. రూ.కోట్ల విలువైన టిడ్కో ఇళ్లను ఏ కారణంతో పాడుపెట్టావ్? పేదలకు ఎందుకివ్వలేదు? వారిని అప్పులపాలు చేయటానికా? నీ కాలనీల పేరుతో భూదాహం తీర్చుకోటానికా? ఓపక్క గుక్కెడు నీరులేక జనం గొంతెండుతుంటే, రాష్ట్రాన్ని కల్తీ మద్యం, గంజాయి, డ్రగ్స్‌తో నింపేసిన ఘనుడివి నువ్వు... నిన్ను ఈసారి జనం జైలుకు పంపటానికే నిశ్చయించుకున్నారని, నీకు బైబై చెప్పేరోజు దగ్గరలోనే ఉందని గుంటూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌లు తీవ్రస్థాయిలో విమర్శించారు. గురువారం తెనాలిలో ఇరువురు నాయకులు అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత తెనాలి టీబీ రోడ్డులో టీడీపీ పార్టీ కార్యాలయాన్ని ఇరువురూ ప్రారంభించారు. తర్వాత పాడుబెట్టిన టిడ్కో ఇళ్లను పరిశీలించారు. తర్వాత బీసీలు, తెనాలి ఫుడ్ అండ్ హోటల్ యజమానుల సంఘాలతో ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలుచోట్ల విలేకరుల సమావేశాల్లో మాట్లాడారు. ఎంతో ముందు చూపుతో చంద్రబాబు తీసుకొచ్చిన పట్టిసీమను పక్కనపెట్టి, కృష్ణా డెల్టాలో నీటికి కటకటలాడేలా చేశారని చంద్రశేఖర్ విమర్శించారు. కనీసం తాగటానికి గుక్కెడు నీరు దొరకని పరిస్థితి రాష్ట్రంలో ఉంటే, కల్తీ మద్యం, గంజాయి, డ్రగ్స్‌ను మాత్రం ఏరులుగా పారిస్తున్నారని మండిపడ్డారు. తన కూటమిలోని జగన్‌బాబా అరడజను దొంగలకు దోచిపెట్టేందుకు కల్తీ మద్యాన్ని దింపేసి, గంజాయితో యువకుల జీవితాలను చిత్తుచేసి, అవి చాలవన్నట్టు ఏకంగా డ్రగ్స్ మహమ్మారిని రాష్ట్రానికి అలవాటుచేసిన ఘన చరిత్ర జగన్‌కే దక్కుతుందన్నారు. అంతర్జాతీయ స్థాయి సామర్థ్యం ఉన్న కాంట్రాక్టర్‌లతో అత్యున్నత ప్రమాణాలతో చంద్రబాబు టిడ్కో ఇళ్లు నిర్మిస్తే, వాటిని పేదలకు ఇవ్వలేదన్నారు. 300 గజాల టిడ్కో ఇంటికి ఒక్క రూపాయికూడా తీసుకోకుండా చంద్రబాబు టిడ్కో ఇళ్లు నిర్మించి ఇస్తే, మీరు ఒక్క మంచం కూడా పట్టని 100 గజాల ఇంటికి రూ. 50వేల వరకు వసూలు చేశారని, అంత డబ్బు కట్టినా పేదలకు నేటికీ గూడు సమకూరలేదన్నారు. జగనన్న కాలనీల పేరుతో భూముల కొనుగోళ్లలో రూ.వందల కోట్లు వైసీపీ నేతలు దోచేస్తే, రోడ్లు, విద్యుత్తు సదుపాయాల పేరుతో అధిక రేట్లకు పరికరాలు కొనుగోలుచేసి రూ. వేల కోట్లు దోచుకున్నారని అన్నారు. ఈసారి జాగ్రత్తగా ఆలోచించి ఓటు వేసి జగన్‌బాబా దొంగలను ఓడించి మీరు గెలవాలని కోరారు.

అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి మనోహర్ మాట్లాడుతూ జనం ఇబ్బందుల్లో ఉంటే, రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే జగన్ ఒక్క రూపాయయినా తన కంపెనీల నుంచి కానీ, తాను సంపాదించిన డబ్బు నుంచి కానీ పేదలకు పంచాడా? అని ప్రశ్నించారు. ఎవరైన కష్టపడి సంపాదిస్తే వారికి డబ్బు విలువ తెలుస్తుందని, దోచుకున్న వారికి డబ్బుపైనే ప్రేమ ఉంటుంది కానీ, జనంపై ఉండదనేది ఇప్పటికైనా గుర్తించాలన్నారు. ఈ ఐదేళ్లలో తెనాలిలోనే కాకుండా రాష్ట్రం మొత్తంలో వ్యాపారులు, వర్తకులు ఎన్నో రకాలుగా అధికార పార్టీ దౌర్జన్యానికి బలయ్యారని, ఆస్తులు కబ్జాలకు, దోపిడీకి గురయ్యారని, ఇకపై అటువంటి పరిస్థితి ఉండదని మనోహర్ మాటిచ్చారు. మీ ఆస్తులు పదిలంగా ఉంటాయని, మీపై దాడులు జరగవని, ఒకవేళ ఎవరైన అటువంటి అక్రమాలకు పాల్పడితే తిప్పి కొడతామని స్పష్టం చేశారు. జ్యోతీరావు పూలే, అంబేద్కర్ ద్వారం పేర్లు తీసేసి వైఎస్ ద్వారాలని మార్చటం కుట్ర కోణమేనన్నారు. జగన్ పాలనలో సంక్షేమం బాగా జరిగిందనే అపోహలో కొందరు పేదలు ఉన్నారని, అయితే ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్‌ల నిధులు దారి మళ్లించేశారనేది గుర్తించాలన్నారు. ఆయన నొక్కిన బటన్‌లు కనిపిస్తున్నాయేకానీ, జనం ఖాతాల్లో డబ్బు మాత్రం కనిపించటంలేదని, ఇదేం మాయో అర్థం కావటంలేదన్నారు. సంక్షేమ పథకాలకు మేము వ్యతిరేకమని తప్పుడు ప్రచారానికి దిగుతున్నారని, జనసేన, టీడీపీ కలసి విడుదల చేసిన సూపర్ 6ను చూస్తే సంక్షేమానికి మేము ఎంతటి ప్రాధాన్యం ఇస్తున్నామో అర్థమవుతుందన్నారు. రేపటి ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థుల గెలుపుకోసం మీరంతా ముందుకు రావాలని మనోహర్ కోరారు.

# కోడ్ ఉన్నా బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం

- ఎన్నికల సమయంలో వైసీపీ నాయకుల నిర్వాకం
- టీడీపీ నాయకుల అభ్యంతరాలు
- ఎన్నికల అధికారులకు ఫిర్యాదు



పనులను అడ్డుకున్న పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, వీఆర్‌వో రమాదేవి

నూజెండ్ల, మార్చి28: ఎన్నికల సమయంలో కాంట్రాక్టర్ ప్రతినిధులు వైసీపీ నాయకులతో కలసి గుండ్లకమ్మ నది పై పాతనాగిరెడ్డిపల్లె సమీపంలో బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించేందుకు కొబ్బరికాయలు కొట్టడం వివాదంగా మారింది. గతంలో అందుగుల కొత్తపాలెం నుంచి వయా నాగిరెడ్డిపల్లి, లింగముక్కపల్లి నుంచి చింతల చెరువుకు ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజనలో రోడ్డు నిర్మాణం జరిగింది. ఈ నిర్మాణంలో గుండ్లకమ్మ నదిపై పాత నాగిరెడ్డిపల్లె వద్ద బ్రిడ్జి నిర్మాణం చేయలేదు. ఈనెల 7వ తేదీన ప్రభుత్వంతో కాంట్రాక్టర్ ఒప్పందం చేసుకొని ఎన్నికల కోడ్‌కు ఒక్క రోజు ముందుగా 15వ తేదీన కాంట్రాక్టర్ రూ.16 కోట్ల వ్యయంతో బ్రిడ్జి నిర్మాణ పనుల్లో భాగంగా ల్యాబ్ నిర్మాణ పనులు చేపట్టారు. కాగా ఎన్నికల కోడ్ వచ్చిన అనంతరం వైసీపీ నాయకులతో కలసి నిర్మాణ పనులను ప్రారంభించటం రాజకీయంగా లబ్ధి పొందేందుకే కోడ్ ఉల్లంఘిస్తున్నారని మండలంలోని టీడీపీ నాయకులు ఎన్నికల అధికారి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి వీ రామకృష్ణ, వీఆర్‌వో రమాదేవిలు పనులు చేసేందుకు వచ్చిన కాంట్రాక్టర్ ప్రతినిధులకు పనులు నిలిపివేసి పొక్లెయినర్‌ను వెనక్కి తీసుకువెళ్ళాలని సూచించటంతో నిర్మాణ పనులను ప్రారంభించ లేదు. ఈ విషయ మై ఎంపీడీవో టీ వీరభద్రాచారిని వివరణ కోరగా ఎన్నికల కోడ్ రాక ముందు నిర్మాణంలో ఉన్నటువంటి పనుల వివరాలను ఉన్నతాధికారులకు తెలియజేశామని, నూతనంగా నిర్మించనున్న బ్రిడ్జి విషయంపై ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించి అమలు చేయనున్నామని తెలిపారు.

# వైసీపీ ఆత్మీయ సమావేశంలో ఫీల్డ్ అసిస్టెంట్



వేల్పూరులో అనిల్‌కుమార్‌యాదవ్‌తో కరచాలనం చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్

శావల్యాపురం, మార్చి 28: ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ప్రభుత్వ ఉద్యోగులెవ్వరూ రాజకీయ పార్టీలు నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొనకూడదని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసినప్పటికీ కొందరు ప్రభుత్వ ఉద్యోగులు అవేమీ తమకు పట్టవన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. పార్టీ కార్యక్రమాల్లో తరచూ పాల్గొంటూ నాయకుల వద్ద వారి స్వామి భక్తిని చాటుకొంటున్నారు. ఈనెల 27వతేదీన మండలంలోని వేల్పూరు గ్రామంలో ఉన్న బొల్లా హనుమయ్య, మాణిక్యమ్మల కళ్యాణ వేదికలో వైసీపీ కార్యకర్తలతో అనిల్ కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో చిన్నకంచెర్ల గ్రామానికి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ ముంద్రు ప్రభు పాల్గొని ఎంపీ అనిల్‌కుమార్‌తో పరిచయం చేసుకొంటూ కరచాలనం చేస్తున్నట్లుగా ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీనిపై ఎంపీడీవో కొర్రపాటి కవితాచౌదరిని వివరణ కోరగా విషయం తమ దృష్టికి రాగానే ఫీల్డ్ అసిస్టెంట్ ప్రభుకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్‌కు జరిగిన విషయాన్ని తెలియజేశామన్నారు. డ్వామా పీడీ ఆదేశాల మేరకు ఫీల్డ్ అసిస్టెంట్‌పై తదుపరి చర్యలు తీసుకొంటామన్నారు.

## అసలే ఎండ.. ఆపై ఉక్కపోత

- అనధికారంగా తరగతులు.. ఉక్కిరిబిక్కిరైన విద్యార్థులు

రెంటచింతల, మార్చి 28: అత్యధిక ఉష్ణోగ్రతకు పేరుగాంచిన రెంటచింతలలో విద్యార్థులు పది రోజులపాటు ఇక్కట్లు పడ్డారు. అసలే ఎండ, ఆపై తీవ్ర ఉక్కపోతతో విద్యార్థులు ఈ పరీక్షలు ఎప్పుడు ముగుస్తాయా అని ఎదురుచూశారు.. పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. మండల కేంద్రమైన రెంటచింతలలో నాలుగు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు జరిగాయి. ఇందులో రెండు ఎయిడెడ్ కాగా మిగిలిన రెండు ప్రైవేటు పాఠశాలలు. ఈ పాఠశాలల్లో ఉదయం 9 నుంచి పదో తరగతి పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు ముగిసిన అనంతరం విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా మిగిలిన తరగతుల విద్యార్థులకు కొన్ని పాఠశాలలు మధ్యాహ్నం నుంచి ఒంటి పూట బడులు నడిపాయి. ఎండ తీవ్రతకు పది రోజులపాటు కింది స్థాయి తరగతి విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. దూరాభారం నుంచి వచ్చే విద్యార్థులు ఎండ వేడిమికి తట్టుకోలేక అవస్థలు పడ్డారు. ఈ క్రమంలో గురువారం ఎంఈవో - 2 శివనాగేశ్వరరావు పరీక్షలు జరిగిన కేంద్రాలను పరిశీలించారు. శనివారం ఉదయం నుంచి ఒంటిపూట బడులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.



వెంకటపాలెంలో నిరసనలు వ్యక్తం చేస్తున్న మహిళలు, రైతులు

## అడ్డగోలు పాలనకు చరమ గీతమే

- 1563 రోజుకు రైతుల ఆందోళనలు

తుళ్లూరు, మార్చి 28: అడ్డగోలు వైసీపీ పాలనకు చరమగీతం పాడటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని 33 వేల ఎకరాల భూములు రాజధాని అమరావతి కోసం త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్, రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పును అమలు చేయాలంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఉద్యమం గురువారం నాటికి 1563 రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మూడు రాజధానులంటూ ప్రాంతాల మధ్య విద్వేషాలకు సీఎం జగన్‌రెడ్డి ఆజ్యం పోయాలని చూశాడన్నారు. మూడు ముక్కలాటతో రాష్ట్ర సర్వనాశనమైందని ఆగ్రహం వ్యక్తంచేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.



పూజారి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న దండమూడి విజయ్

## మానవత్వాన్ని చాటిన 'స్నేహ హస్తాలు'

- పూజారి గుండె శస్త్రచికిత్సకు రూ.9 లక్షల ఆర్థికసాయం

గుంటూరు(విద్య),మార్చి28: స్నేహహస్తాలు ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ మిత్రులు తమ మానవత్వాన్ని చాటుకున్నారు. అమృతలూరు మండలం ప్యాపర్రు గ్రామానికి చెందిన పేద పూజారి పొన్నూరు శ్రీనివాసరావు గుండె ఆపరేషన్ ఖర్చులకు అదే గ్రామానికి చెందిన ప్రవాసాంధ్రులు గడ్డిపాటి షర్మిల స్పందించి స్నేహహస్తాలు ఫౌండేషన్ సభ్యులు, తన తోటి స్నేహితుల సహకారంతో రూ.9 లక్షల ఆర్థిక సహాయం అందించారు. ట్రస్టీ దండమూడి విజయ్ చేతుల మీదుగా పూజారి సతీమణి సౌజన్య, కుటుంబసభ్యులకు గురువారం అరండల్‌పేట బంధువుల ఇంటిలో అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టీ దండమూడి విజయ్, మేనేజింగ్ ట్రస్ట్ ఎంవీ.రావు, కార్యదర్శి ఏ బాల మురళీకృష్ణ, కోఆర్డినేటర్ టీ కరిముల్లా, ఎం.రాధికారాణి, జీపీ హరి, కౌశిక, ఇందుప్రియ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాపట్ల ఎంపీ అభ్యర్థి టి.కృష్ణప్రసాద్, పక్కన అనగాని సత్యప్రసాద్

## రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టింది జగనే

- బాపట్ల ఎంపీ అభ్యర్థి టి.కృష్ణ ప్రసాద్

రేపల్లె, మార్చి 28: ఐదేళ్ళ జగన్‌రెడ్డి ప్రభుత్వంలో రాష్ట్రం చీకటి అంధకారంలో నెట్టివేయబడిందని బాపట్లపార్లమెంటరీ టీడీపీ అభ్యర్థి టి.కృష్ణప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలె టీడీపీ ప్రభుత్వం దళితులకు 27 పథకాలు అమలుచేసి వారికి అండగా నిలిచిందన్నారు. అనంతరం సీఎం జగన్‌రెడ్డి ఆ పథకాలను రద్దు చేశాడని అన్నారు. దళితులపై వివక్ష చూపుతూ వారిపై దాడులు చేయిస్తూ కపటప్రేమ నాటకాన్ని జగన్మోహన్‌రెడ్డి ఆడుతున్నారన్నారు. రాష్ట్రంలో యువత ఉద్యోగ అవకాశాలు లేక పక్క రాష్ట్రాలకు తరలి వెళ్ళిపోతున్నారని, అయినా ప్రభుత్వానికి సిగ్గుకూడా లేదన్నారు. ఐదేళ్ళలో ప్రజల ఆదాయం పెరగలేదు. ఆస్తులు పెరగలేదు, కానీ జగన్‌రెడ్డి ఆదాయం మాత్రం విపరీతంగా పెరిగిందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ళలో 9సార్లు విద్యుత్ చార్జీలు పెంచి పేదల నడ్డి విరిచారన్నారు. మద్యాన్ని నిషేదిస్తామనిచెప్పి ఓట్లు వేయించుకుని రూ.60 బాటిల్‌ను రూ.250లకు అమ్ముకుంటూ కోట్లాది రూపాయలు ధనాన్ని తాడేపల్లి ఖజానాను నింపుకుంటున్నారన్నారు. రక్తం పంచుకున్న పుట్టిన చెల్లి పుట్టుకను ప్రశ్నించారంటే తల్లిని అవమానించినట్లు కాదా మహిళా వ్యక్తిత్వాన్ని కించపరిచే ఇలాంటి దుర్మార్గున్ని ఏం చెయ్యాలో ప్రజలు ఆలోచించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లకు వచ్చిన నిధులన్నీ పక్కదారి పట్టించి వారిని అన్యాయం చేసిన ఘనత జగన్‌దేనన్నారు. ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ ఐదేళ్ళ జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రాన్ని 30సంవత్సరాలు వెనక్కి వెళ్ళిందన్నారు. మొన్నటి వరకు పరదాలు కట్టుకుని తిరిగే పరదాల వీరుడు జగన్‌రెడ్డి ఇప్పుడు రోడ్డెక్కుతూ ప్రజలను మరోసారి మాయమాటలు చెప్పి నమ్మించి మోసం చేసేందుకు మీముందుకు వస్తున్నాడని అన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పంతాని మురళీధరరావు, వైవీఎస్ ప్రసాద్, లుక్కా గుడారంకయ్య, కొలసాని రాము, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక రైళ్ల సర్వీసులు పొడిగింపు

గుంటూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం గుంటూరు మీదగా రాకపోకలు సాగిస్తున్న ప్రత్యేక రైళ్ల సర్వీసులను జూన్ నెలాఖరు వరకు పొడిగించినట్లు డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నెంబరు. 08585 విశాఖపట్టణం - కర్నూలు టౌన్(ప్రతీ మంగళవారం) రైలుని ఏప్రిల్ 2 నుంచి జూన్ 25వ తేదీ వరకు, నెంబరు. 08586 కర్నూలుటౌన్ -విశాఖపట్టణం(ప్రతీ బుధవారం) రైలుని ఏప్రిల్ 3 నుంచి జూన్ 26 వరకు, నెంబరు. 08579 విశాఖపట్టణం - సికింద్రాబాద్ (ప్రతీ బుధవారం) రైలుని ఏప్రిల్ 3నుంచి జూన్ 26వ తేదీ వరకు, నెంబరు. 08580 సికింద్రాబాద్ - విశాఖపట్టణం(ప్రతీ గురువారం) రైలుని ఏప్రిల్ 4 నుంచి జూన్ 27వ తేదీ వరకు పొడిగించినట్లు డీఆర్ఎం తెలిపారు.

## రూ.19.05 లక్షలు సీజ్

అమృతలూరు / కొల్లిపర, మార్చి 28: ఇద్దరి వ్యక్తులు తరలిస్తున్న నగదు రూ.19.05 లక్షలను సీజ్ చేశారు. అమృతలూరు మండలంలోని పెదపూడి వంతెన వద్ద బుధవారం రాత్రి తనిఖీలు నిర్వహిస్తుండగా ఈ నగదు పట్టుబడింది. తెనాలి నుంచి బాపట్ల వైపుకు ఏలాంటి పత్రాలు లేకుండా తెస్తున్న ఇద్దరి వ్యక్తుల వద్ద నుంచి ఈ నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయంను అధికారులు ఆర్‌వో వసంతరాయుడు దృష్టికి తీసుకువెళ్ళారు. ఆయన ఈ నగదును సీజ్ చేయమన్నట్లు సమాచారం.

గురువారం తెల్లవారు జామున కొల్లిపర మండల పరిధిలోని దావులూరు అడ్డరోడ్డు వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో తూములూరు గ్రామానికి చెందిన రావులశెట్టి శ్రీనివాసరావు వద్ద రూ. 1 లక్షా 9 వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రవీంద్రరెడ్డి తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ స్వాధీనం చేసుకున్న నగదును పోలీసుస్టేషన్ అప్పగించినట్లు తెలియజేశారు.

## 9.5 లక్షల నగదు పట్టివేత

- కారులో తరలిస్తుండగా స్వాధీనం

మేడికొండూరు మార్చి 28: మేడికొండూరు పోలీసు స్టేషన్ పరిధిలోని కొర్రపాడు శివారున ఏర్పాటు చేసిన పోలీసు చెక్‌పోస్టు వద్ద కారులో తరలిస్తున్న 9 లక్షల 50 వేల రూపాయల నగదును గురువారం పోలీసులు పట్టివేశారు. సీఐ దార్ల జయకుమార్ తెలిపిన వివరాల ప్రకారం..

సత్తెనపల్లికి చెందిన గంగూరి రామచంద్రరావు తన క్రెటా కారులో నగదును తరలిస్తుండగా ఎస్ఐ వాసు వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. తనిఖీలో 9లక్షల 50 వేల రూపాయల నగదు కారులో దొరికింది. దీని గురించి ప్రశ్నించగా నగదుకు సంబంధించి సరైన రశీదులు లేకపోవడంతో పాటు ఎన్నికల నియమావళిలో భాగంగా 50 వేలకు మించి నగదు తరలించకూడదన్న నిబంధన మేరకు ఈనగదును సీజ్ చేసినట్టు సీఐ జయకుమార్ వివరించారు.

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 125, 134, 145 |
| చికెన్ విత్ స్కిన్ | 236.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 246.00 |

## 1,12,869 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,03,020 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,12,869 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 73,721 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|
| నాన్ ఏసీ కామన్ వెరైటీ | | |
| 334 | 9000 | 20000 |
| నెంబరు. 5 | 9200 | 15000 |
| 273 | 9000 | 13000 |
| 341 | 9200 | 19500 |
| 4884 | 9200 | 17500 |
| సూపర్ 10 | 11500 | 13000 |
| నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ | | |
| తేజ | 8000 | 21000 |
| బ్యాడిగి | 9000 | 20000 |
| దేవనూరు డీలక్స్ | 9000 | 20000 |
| తెల్లకాయలు | 5000 | 11000 |


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి కృష్ణ ప్రసాద్, ఎమ్మెల్యే అభ్యర్థి నరేంద్రవర్మ

## చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

● టీడీపీ ఎంపీ అభ్యర్థి కృష్ణ ప్రసాద్

బాపట్ల, మార్చి 28 : విజన్ కలిగిన చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎంపీ అభ్యర్థి టి.కృష్ణ ప్రసాద్ అన్నారు. బాపట్ల టీడీపీ కార్యాలయంలో గురువారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కృష్ణప్రసాద్ మాట్లాడుతూ మూడోసారి కూడా నరేంద్రమోదీ ప్రధానమంత్రి కావాలని ప్రపంచ దేశాలు ఆసక్తిగా చూస్తున్నాయన్నారు. కోవిడ్ సమయంలో ప్రధానమంత్రి చేసిన సేవలు చూసి ప్రపంచదేశాలు ఆశ్చర్యానికి గురయ్యాయన్నారు. 1999-2004 వరకు చంద్రబాబు దగ్గర తాను ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ అధికారిగా పని చేశానని, ఆయన పనితీరును దగ్గర ఉండి చూసిన వ్యక్తిగా చంద్రబాబు నాయకత్వం రాష్ట్రానికి ఎంత అవసరమో ప్రజలకు వివరిస్తానన్నారు. ప్రపంచదేశాలు గర్వించే విధంగా చంద్రబాబు రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేశారన్నారు. చంద్రబాబు పాలన, జగన్మోహనరెడ్డి పరిపాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రజలు తెలుసుకోవాలన్నారు. ఉద్యోగ, ఉపాధి, బీమా వంటివి చంద్రబాబుతోనే సాధ్యమన్నారు.

### 31న చంద్రబాబు రోడ్డుషోను జయప్రదం చేయాలి : వేగేశన

ఎన్నికల పర్యటనలో భాగంగా అధినేత నారా చంద్రబాబునాయుడు ఈనెల 31వ తేదిన బాపట్లలో రోడ్డుషో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. రేపల్లెలో బహిరంగసభలో పాల్గొన్న అనంతరం బాపట్ల రోడ్డుషో ఉంటుందన్నారు. అంబేద్కర్ సర్కిల్‌లో ప్రజలనుఉద్దేశించి ప్రసంగిస్తారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికలలో విజయం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఎన్డీయే అభ్యర్థుల గెలుపు కోసం బీజేపీ నాయకత్వం అంకితభావంతో పనిచేస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీ నారాయణ స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కోసం రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావాల్సిన అవసరం గురించి ప్రజలకు వివరిస్తామన్నారు. అవినీతిపాలన అంతమొందించేందుకు కార్యదీక్షతో పనిచేస్తామన్నారు. సమావేశంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు సలగల రాజశేఖర్, తాతా జయప్రకాష్ నారాయణ, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి తానికొండ దయాబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, కార్యదర్శి విన్నకోట వీరయ్యనాయుడు, బీజేపీ నాయకులు మామిడి రమేష్, శ్రీనివాసరాజు, బికృష్ణచైతన్య, సాంబశివారెడ్డి, కొమ్మినేని సూర్యనారాయణ, జనసేననాయకులు హుస్సేన్‌బేగ్, షేక్ కరీముల్లా, దాసరి ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న జిల్లా సంయుక్త కలెక్టర్ శ్రీధర్ తదితరులు

పిట్టలవానిపాలెం, మార్చి 28 : మండల పరిధిలోని చందోలు గ్రామంలో ప్రజలకు ఓటు హక్కుపై బాపట్ల జిల్లా సంయుక్త కలెక్టర్, బాపట్ల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చామకూర్తి శ్రీధర్ గురువారం అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ కె.స్ఫూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో జిల్లా సంయుక్త కలెక్టర్ చామకూర్తి శ్రీధర్ ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క ఓటు మన భవితను మారుస్తుందని, నిర్లక్ష్యమైతే సమాజంలో ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమణమూర్తి, ఈవోపీఆర్డీ కె.పద్మజ, ఇన్‌చార్జి ఆర్ఐలు అమానుల్లా ఖాన్, వీరనాయుడు, వీఆర్వోలు వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

● మండలంలోని మంతెనవారిపాలెం, పిట్టలవానిపాలెం, ఖాజీపాలెం, పిట్టువారిపాలెం, చందోలు గ్రామపంచాయతీలలోని పోలింగ్ కేంద్రాలను జిల్లా సంయుక్త కలెక్టర్, బాపట్ల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చామకూర్తి శ్రీధర్ సంబంధితాధికారులతో కలిసి పరిశీలించారు.

### వాగ్దానాలు అమలు చేయకుండా ప్రచారం సిగ్గు చేటు : నామన

బాపట్ల, మార్చి 28 : గత ఎన్నికలలో ఎమ్మెల్యే కోన రఘుపతి చేసిన వాగ్దానాలు అమలు చేయకుండానే ఎన్నికల ప్ర చారం చేయటం సిగ్గుచేటు అని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ ఎద్దేవా చేశారు. పార్టీశ్రేణులతో కలిసి గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాపట్ల నియోజకవర్గాన్ని తన హయాంలోనే అభివృద్ధి చేశానని చెప్పటం హాస్యాస్పదమన్నారు. సూ ర్యలంక సముద్రతీరాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తానని, వ్యవసాయ కళాశాలను యూనివర్సిటీగా చేస్తానని, చివరి భూములకు సాగునీరు అందించే విధంగా శాశ్వత పరిష్కారం చూపిస్తానని, తీర వాసులకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూస్తానని, అంతర్గత రోడ్లు అభివృద్ధి చేస్తానని, పట్టణంలోని దోమల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని ఎమ్మెల్యే కోన చేసిన వాగ్ధానాలు ఏమ య్యాయని ప్రశ్నించారు? వీటిలో ఒక్కటి కూడా పూర్తి స్థాయిలో అమలు చేయకుండా ఎన్నికలకు రావటం, ప్రచారం చేయటం హాస్యాస్పదమన్నారు. బాపట్ల నియోజకవర్గ అభివృద్ధి జనసేన, టీడీపీ, బీజేపీ కూటమితోనే సాధ్యమన్నారు. సమావేశంలో జనసేన నాయకులు ఏసుబాబు, హుస్సేన్‌బేగ్, ఆరమళ్ళ సుజిత్, షేక్.కరీముల్లా, షేక్.ఆసిఫ్, షేక్.మున్నా, అన్సారీ, శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

## సాహితీవేత్త నారాయణచార్యులు చిరస్మరణీయులు

● అసోసియేట్ డీన్ డాక్టర్ డీడీ స్మిత్

బాపట్ల, మార్చి 28 : సాహితీవేత్త నారాయణచార్యులు చిరస్మరణీయులని డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డిడి స్మిత్ అన్నారు. కళాశాలలో గురువారం నారాయణచార్యుల జయంతి కార్యక్రమాన్ని అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి నిర్వహించారు. ఆయన పటానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో అసోసియేట్ డీన్ మాట్లాడుతూ 12వ ఏటనే ఒక కవిత్వాన్ని అనువదించిన నారాయణస్వామి ఒక పరీక్షకు వెళ్ళినపుడు ఆయన రాసిన కవిత్వమే ఆ పరీక్షా పేపర్‌లో రావటం జరిగిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జి.రవిబాబు, డాక్టర్ జి.వీరప్రసాద్, డాక్టర్ కృపావతి, డాక్టర్ లావణ్య, డాక్టర్ ఎస్.అశోక్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

#### ఆహారవిజ్ఞాన సాంకేతిక కళాశాలలో..

డాక్టర్ ఎన్టీఆర్ ఆహారవిజ్ఞాన సాంకేతిక కళాశాలలో పుట్టపర్తి నారాయణచార్యులు జయంతి కార్యక్రమాన్ని అసోసియేట్ డీన్ డాక్టర్ ఎల్.ఏడుకొండలు అధ్యక్షతన నిర్వహించారు. ఆయన పటానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో అసోసియేట్ డీన్ నారాయణచార్యుల రచనలు గురించి కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ ఇ.గౌతమి, బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### బటన్ నొక్కినా బ్యాంక్ ఖాతాలో పడని నగదు : సీపీఐ

బాపట్లటౌన్, మార్చి 28 : మిచౌంగ్ తుపాన్‌తో నష్టపోయిన రైతులు, కౌలుదారుల బ్యాంక్ ఖాతాలో నష్టపరిహారం బటన్ నొక్కినప్పటికీ జమ కాలేదని సీపీఐ జిల్లా నాయకుడు జేబీ శ్రీధర్ అన్నారు. ఆయన కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ బటన్‌నొక్కి నెలరోజులు అవుతున్నప్పటికీ ఇంత వరకు రైతుల ఖాతాలో నష్టపరిహారం జమ కాకపోవటం వైసీపీ నయవంచనకు నిదర్శనమన్నారు. మినుము, పెసర పంటలు కూడా మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలన్నారు.

### వివేకా హత్యపై సీఎం జగన్ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మరు : కొల్లా

బాపట్లటౌన్, మార్చి 28 : వివేకా హత్యపై సీఎం జగన్ బస్సుయాత్రలో చేసే తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మే పరిస్థితులలో లేరని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి అన్నారు. గురువారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ వివేకానందరెడ్డిని హత్య చేసింది ఎవరో రాష్ట్ర ప్రజలందరికి తెలుసునని, తనపై ఇద్దరు చెల్లెమ్మల వెనుక ఎవరు ఉండి పురిగొలుపుతున్నారో ప్రజలకు తెలుసు అని జగన్ మాట్లాడటం అవివేకమన్నారు. జగన్ ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు వివేకా హత్యపై సీబీఐ విచారణ కోరి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఉపసంహరించుకోవటం వెనుక ఉన్న కుట్రను వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర పోలీసు సహాయ నిరాకరణ వలన అవినాష్‌ను సీబీఐ అరెస్టు చేయకపోవటం వాస్తవం కాదా అని కొల్లా అన్నారు.

### ఒకటో తరగతి ఉచిత ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

కర్లపాలెం, మార్చి 28 : కర్లపాలెం మండలంలోని ప్రైవేట్ పాఠశాలలో ఒకటవ తరగతి చేరబోయే చిన్నారులు ఉచిత ప్రవేశానికి మార్చి 31లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో విజయశ్రీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

# అప్రకటిత విద్యుత్ కోతలు

● దోమలు, ఉక్కబోతతో అల్లాడిన ప్రజానీకం
● 20 గంటలకు పైగా నిలిచిన విద్యుత్ సరఫరా
● ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం
● సెలవులో ఇన్‌ఛార్జ్ ఏఈ


సంకటివారివీధిలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

భట్టిప్రోలు, మార్చి 28: వేసవిని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాల్సిన పరిస్థితి ఉండగా అలాంటి పరిస్థితి భట్టిప్రోలులో మాత్రం కనిపించడం లేదు. అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజానీకం అల్లాడిపోతున్నారు. ఏకంగా 24 గంటలు విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఉక్కబోత ఒకవైపు దోమలు విజృంభిస్తుండటం తో వృద్ధులు, చిన్నారులు, మహిళలు నిద్రలేక జాగారం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. భట్టిప్రోలు మండలానికి కొన్ని సంవత్సరాలుగా పూర్తిస్థాయి అసిస్టెంట్ ఇంజనీర్ విధుల్లో లేకపోవడంతో రేపల్లె ఏఈని ఇన్ ఛార్జ్‌గా నియమించారు. ఇటీవల కొన్ని రోజులుగా ఇన్‌ఛార్జ్ ఏఈ సెలవుపై వెళ్లారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేని కారణంగా కింది స్థా యి ఉద్యోగులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విద్యుత్ వినియోగదారులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే గంటల కొద్ది పునరుద్ధరణకు నోచుకోవడం లేద ని సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేస్తే మీ పరిధిలోని లైన్‌మెన్‌కు ఫోన్ చేయం డని సమాధానం చెప్పి ఫోన్ పెట్టివేస్తున్నారని వినియోగదారులు ఆగ్ర హం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం సాయంత్రం స్థానిక సంకటివారివీధి శివాలయం ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు వచ్చిం ది. తక్షణమే స్పందించి ప్రత్యామ్నాయ మార్గం ద్వారా విద్యుత్ సరఫ రా చేయాల్సి ఉండగా సంబంధిత లైన్‌మ్యాన్‌కు ముందు జాగ్రత్త లేని కారణంగా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేని కారణంగా సుమారుగా గురువారం సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీం తో వినియోగదారులు, వ్యాపారులు అవస్థలను ఎదుర్కొన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని పెరుగుతున్న విద్యుత్ వాడకాన్ని పరిగణనలోకి తీసుకుని విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్లను వినియోగించాలని విద్యుత్ వినియోగదారులు కోరుతున్నారు.

# కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

● ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్


టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రేపల్లె, మార్చి 28: రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వమైన టీడీపీ, జనసేన, బీజేపీలతోనే సాధ్యమని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిజాంపట్నం జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య మండల అధ్యక్షుడు ఒగిబోయిన వెంకటయాదవ్ ఆధ్వర్యంలో నిజాంపట్నం మండలం ఆముదాలపల్లి పంచాయతీ కొమరవోలుకు చెందిన వైసీపీ నాయకులైన కన్నేటి వేణు, డి.ఫణికుమార్, నర్రా వెంకటేశ్వరరావు, నర్రా కోటయ్యస్వామి, సునిల్, డి.మణిదేవ్, కె.శ్రీనివాసరావు, డి.శివకుమార్, ఎం.బాజీబాబు, డి.కృష్ణం రాజు, యూ.మహేష్, ఎం.వెంకటేశ్వరరావు, టి.సాంబశివరావు, జీ.ఏలేషా, డి.సుబ్రహ్మణ్యం, కె.శంకర్, డి.నాగరాజు, ఎం.స్వాములకు ఎమ్మెల్యే అనగాని టీడీపీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని ఎవరూ అధైర్యపడాల్సిన పనిలేదని, రానున్నది టీడీపీ ప్రభుత్వమేనన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని చిత్తుగా ఓడించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పందరబోయిన కృష్ణ, మరకా మునలయ్య, తదితరులు పాల్గొన్నారు.

#### ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలి

రానున్న సార్వత్రిక ఎన్నికలు 45రోజులు మాత్రమే ఉన్నాయని ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేసి వైసీపీ చేసిన అరాచక పాలనను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలని అనగాని సత్యప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్యనేతలకు బాపట్ల లోక్‌సభ అభ్యర్థి అయిన టి.కృష్ణప్రసాద్ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయం దగ్గర పడటంతో ఎవరూ అశ్రద్ధగా ఉండరాదని, పార్టీ గెలుపుకోసం ప్రచారాన్ని కొనసాగించాలని సూచించారు. టి.కృష్ణప్రసాద్‌కు అందరూ అండగా నిలిచి ఆయన గెలుపునకు కృషి చెయ్యాలని సూచించారు. ఈ సందర్భంగా టి.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో లోక్‌సభ అభ్యర్థిగా పోటి చేస్తున్నానని మీరంతా నాపై చూపించిన అభిమానం వెలకట్టలేనిదన్నారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పంతాని మురళీధరరావు, బాపట్ల జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి తాతా ఏడుకొండలు, తెలుగుయువత అధ్యక్షులు కొలసాని రాము, పూషడపు కుమారస్వామి, రేపల్లె రామాంజనేయులు, వడ్డి లక్ష్మీజీ, పీవీ చింతారావు, దామెర్ల రాజారావు పాల్గొన్నారు.


వైద్యశిబిరాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీపీవో రవికుమార్

### సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి : డీపీవో

బాపట్ల, మార్చి 28 : సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండి వైద్యసిబ్బందికి సహకరిస్తూ రోగులకు సేవలందించాలని జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ తెలిపారు. బాపట్ల మండలం తూర్పు పిన్నిబోయనవారిపాలెం గ్రామంలో అతిసారం వ్యాపించి ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్న డీపీవో సిబ్బందితో కలిసి గురువారం గ్రామాన్ని సందర్శించారు. తాగునీటి వనరులు, రోగులకు అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని, సచివాలయం ఉద్యోగులు, వైద్యసిబ్బంది గ్రామంలో ప్రచారం చేయాలని ఆదేశించారు. గ్రామంలో ఉన్న మంచినీటి సరఫరా ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను, కుళాయిలను పరిశీలించి క్లోరినేషన్ తప్పనిసరిగా చేయాలన్నారు. ప్రజలకు మరికొన్ని రోజులపాటు ట్యాంకర్‌ల ద్వారా సురక్షితమైన తాగునీటిని అందించాలని చెప్పారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పులి శరత్‌బాబు, గ్రామ కార్యదర్శి స్టాలిన్‌బాబు, గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రజల ఇబ్బందులను ప్రభుత్వాధికారులు పరిష్కరించాలి : సీపీఎం

బాపట్ల,మార్చి 28 : బాపట్ల మండలం తూర్పు పిన్నిబోయనవారిపాలెం గ్రామంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వాధికారులు పట్టించుకొని పరిష్కరించాలని సీపీఎం నాయకులు కె.శరత్ డిమాండ్ చేశారు. గ్రామాన్ని గురువారం సందర్శించిన ఆయన రోగులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించి డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్ళారు. అనారోగ్యానికి గురైన వారికి వెంటనే మెరుగైన వైద్యసదుపాయం కల్పించాలన్నారు. వేసవిలో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టి తాగునీటి సౌకర్యం మెరుగుపర్చాలన్నారు. ఈ విషయంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యంగా ఉన్నారని చెప్పారు. ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవటం దారుణమన్నారు. ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆర్థిక స్తోమతలేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు, సురక్షితమైన తాగునీటిని అందించాలన్నారు. కార్యక్రమంలో శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే కోన సతీమణి ప్రచారం

బాపట్ల, మార్చి 28 : ఎమ్మెల్యే కోన రఘుపతి గెలుపు కోరుతూ ఆయన భార్య కోన రమాదేవి గురువారం స్టూవర్టుపురం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మరోసారి తన భర్తను గెలిపించాలని ఆమె ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ఎంపీపీ చినపోతుల హరిబాబు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, పార్టీశ్రేణులు పాల్గొన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే కోన రఘుపతి అడవిగ్రామపంచాయతీ అడవిపల్లెపాలెం, పాండురంగాపురం గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

### చెక్‌పోస్ట్ విధులకు బల్లికురవ ఎస్ఐ

బాపట్ల, మార్చి28(ఆంధ్రజ్యోతి): అధికారపార్టీకి కొమ్ముకాస్తూ వేధింపులకు గురి చేస్తున్నారని బల్లికురవ ఎస్ఐ నాగశివారెడ్డిపై ఆరోపణల పరంపర నిన్నమొన్నటి వరకు కొనసాగుతూనే వచ్చింది. ఓ వైపు అతని వ్యవహారశైలిపై విమర్శలు వెల్లువెత్తుతున్నా తీరు మారకపోగా ఏకంగా స్టేషన్‌లోనే వైసీపీ నేతచేత సన్మానం అందుకోవడం మరింత విస్మయపరచింది. వీటన్నింటి నేపథ్యంలో సమగ్ర విచారణ చేయించిన ఎస్పీ అతడిని పర్చూరు మండల పరిధిలోని అన్నంబొట్లవారిపాలెంలోని చెక్‌పోస్టు విధులకు నియమిస్తూ బుధవారం ఆదేశాలిచ్చారు. సాంకేతికంగా బల్లికురవ స్టేషన్ విధులనుంచి ఎస్ఐ నాగశివారెడ్డిని పక్కకు పెట్టినట్లైంది

### 550 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

బాపట్ల, మార్చి 28 : మండలంలోని వెదుళ్ళపల్లి కుందేరువాగు సమీపంలో నాటుసారా తయారు చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు డీఎస్పీ మురళీకృష్ణ, రూరల్ సీఐ హజరత్‌బాబు, వెదుళ్ళపల్లి ఎస్సై అజిత సిబ్బందితో కలిసి దాడులు చేశారు. నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లంఊట డ్రమ్ములను గుర్తించి వాటిని వెలికితీసి 550 లీటర్లు బెల్లం ఊటను ధ్వంసం చేశారు.

### రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబు అహర్నిశలు కృషి

అమృతలూరు, మార్చి 28: రాష్ట్ర భవిష్యత్తు కోసం అహర్నిశ లు కష్టపడుతున్న వ్యక్తి నారాచంద్రబాబు అని నక్కా అఖిలేశ్ తెలిపారు. గురువారం మండలపరిధిలోని తురుమెళ్ళలో తండ్రి కి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం, జనసేన కార్యకర్తలతో కలసి ఇంటింటికి తిరుగు తూ సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. భావితరాలు బాగుండాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహంకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. యలవర్తి బ్రహ్మానందం, శరణు శేషగిరి, బేతాళ కిరణ్, ఆళ్ళ అంకమ్మరావు, కొసరాజు దేవకుమార్, గ్యారా నరేష్, పాములపాటి సుబ్బారావు, మాథ్యూస్, తదితరులు పాల్గొన్నారు.


తురుమెళ్ళలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న నక్కా అఖిలేశ్

### లంక గ్రామాల్లో భద్రతా బలగాల కవాతు

కొల్లూరు, మార్చి 28 : లంక గ్రామాల్లో భద్రతా బలగాలు కవాతు నిర్వహించాయి. గురువారం సాయంత్రం మండల పరిధిలోని తోకలవానిపాలెం, కిష్కిందపాలెం గ్రామాల్లో ఎస్ఐ రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర భద్రతా బలగాలు గ్రామ పురవీధు ల్లో కవాతు చేశాయి. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మే 13వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలంతా తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం పటిష్ట ఏర్పాట్లు చేసిందని, అందులో భాగంగా నే భద్రతా బలగాలు కవాతు నిర్వహించినట్లు చెప్పారు. కవాతులో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

### దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ

అమృతలూరు, మార్చి 28: దాతల సహకారం అభినందనీయమని ఎంపీపీ రాపర్ల నరేంద్రకుమార్ తెలిపారు. ఏప్రిల్ 14న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి పురస్కరించుకుని దివ్యాంగులకు ఈ సైకిళ్లను పంపిణీ చేశారు. దేవరపల్లి వెంకయ్య, దయమ్మ దంపతుల జ్ఞాపకార్థం కుటుంబసభ్యుల ఆర్థిక సహకారంతో అనారోగ్యంతో దివ్యాంగులుగా మారిన గరికపాటి వెంకటరత్నం, రేవెళ్ళ పరిశుద్ధరావులకు స్థానిక కొండమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ నరేంద్రకుమార్ చేతుల మీదగా ట్రై సైకిళ్లు అందజేశారు. సర్పంచ్ దేవరకొండరాము, మాజీ సర్పంచ్ కూచిపూడి సతీష్ కుమార్, గుళ్ళపల్లి ఎస్ఎంసీ చైర్మన్ విజయకిషోర్, కొండమూరి భాస్కరరావు, ఆర్ఎంపీ బాషా, మండే కోటేశ్వరరావు, రామా రావు, ప్రభాకరరావు, దేవ రవి, జ్యోతుల ధనుంజయరావు పాల్గొన్నారు.

### బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కేసన


వెంకట గోపాలరావును అభినందిస్తున్న ఎన్నికల అధికారి ప్రశాంత్‌కుమార్

రేపల్లె, మార్చి 28: రేపల్లె బార్ అసోసియేషన్ ఎన్నికల్లో కేసన వెంకట గోపాలరావు ప్యానల్ ఘన విజయం సాధించిందని ఎన్నికల అధికారి గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్ అన్నారు. గురువారం రేపల్లె బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా కేసన వెంకటగోపాలరావు 50ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. జనరల్ సెక్రటరీగా గరికపాటి వెంకట గిరిధరరావు 81ఓట్లతో గెలుపొందారు. జాయింట్ సెక్రటరీగా ఒడుగు రాంబాబు 52ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. లైబ్రేరియన్‌గా కె.సంజయ్ 101ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. అధ్యక్షుడిగా ఎన్నికైన గోపాలరావును పలువురు సీనియర్ న్యాయవాదులు, సహచర మిత్రులు, పట్టణ ప్రముఖులు అభినందించారు.

### నేడు టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

పిట్టలవానిపాలెం, మార్చి 28 : స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ అవిర్భావ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పిట్టలవానిపాలెం మండల టీడీపీ అధ్యక్షుడు ఎండి అఫ్జల్, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటిలు వేర్వేరు ప్రకటనలో తెలిపారు.



### ఆనందబాబు విజయం కోరుతూ ప్రచారం

కొల్లూరు, మార్చి 28: వేమూరు నియోజకవర్గ టీడీపీ, జనసే న, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నక్కా ఆనందబాబు తరపున ఆ పార్టీ ల నాయకులు ప్రచారం నిర్వహించారు. గురువారం సాయం త్రం మండల పరిధిలోని అనంతవరం గ్రామంలో పార్టీ శ్రేణులు ఇంటింటికి తిరుగుతూ ఉమ్మడి అభ్యర్థి ఆనందబాబుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ, బాబు సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను ఓటర్లకు పంపిణీ చేశారు. ప్రచార కార్యక్రమంలో మం డల టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎం పీపీ డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, పార్టీ నాయకులు యలవర్తి కోటేశ్వరరావు, నాగళ్ల వెంకటకృష్ణారావు, నాగళ్ల రాం బాబు, కొడాలి వెంకటనారాయణ, ఎంపీటీసీ రాంబాబు, ధూళిపాళ్ల వెంకటేశ్వరరావు, నాగళ్ల రత్నబాబు, జాలాది సాయిబాబు, ఎన్నారై మణికంఠ, వేములపల్లి మోహనకృష్ణ, సుంకర రాంబా బు, జీవీఎల్‌జి భగవాన్, గుమ్మడి శివ, కోగంటి శివవెంకటేశ్వరరావు, దూళిపూడి కృష్ణ, రావుల రమేష్, తుమ్మల బాపయ్య చౌద రి, మున్నంగి విజయ్, రాఘవరావు, తోట సాంబయ్య, పులివర్తి నాంచారయ్య పాల్గొన్నారు.


అనంతవరంలో ఉమ్మడి అభ్యర్థి ఆనందబాబు విజయం కోరుతూ ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

### కూటమి అభ్యర్థి ఆనందబాబు గెలుపుతోనే అభివృద్ధి

భట్టిప్రోలు, మార్చి 28: కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు గెలుపుతోనే నియోజకవర్గం అభివృద్ధి సాధించగలుగుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా అన్నారు. ప్రచారంలో భాగంగా 2వ రోజు గురువారం రాత్రి స్థానిక రైలుపేటలో గడగడపకు వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. టీడీపీ - జనసేన - బీజేపీ కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబును సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాడి తప్పిన రాష్ట్రాన్ని అభివృద్ధిబాటలో పయనించేలా చేయగల సమర్థత గల నాయకుడు నారా చంద్రబాబునాయుడు ఒక్కడేనని అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా ఆయన పాలన సాగుతుంద ని ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కనపర్తి సుందరరావు, బట్టు మల్లికార్జునరావు, పూరేటి మాణిక్యారావు, జంగం శ్యాంసన్, ఇబ్రహీంబేగ్, డొక్కు శ్రీనివాసరావు, ఇంతియాజ్, ప్రసాద్, నాగరాజు, పోతురాజు, కుందేటి బసవకోట్లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


రైలుపేటలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సాయిబాబా, నాయకులు

### ఉద్యోగుల ప్రవర్తన నిష్పక్షపాతంగా ఉండాలి : ఎంపీడీవో

వేమూరు, మార్చి 28: ఎన్నికల వేళ ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తన నిష్పక్షపాతంగా ఉండాలని ఎంపీడీవో శేషగిరిరావు పేర్కొన్నారు. స్థానిక రోశయ్య మీటింగ్ హాల్లో గురువారం మండల పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులతో ఎన్నికల ప్రవర్తన నియమావళిపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ ఏ పార్టీ అభ్యర్థికి అనుకూలంగా ఉండటం గానీ, సూచనలు ఇవ్వడం గానీ ఏ మాత్రం చేయరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన ఉద్యోగులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలకు సంబంధించిన కార్యకలాపాల్లో వలంటీర్లు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే అలాంటి వారిని విధుల నుంచి బహిష్కరిస్తామన్నారు. మండల తహసీల్దార్ కిరణ్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల అభ్యర్థుల సభలు, సమావేశాలకు బైక్ ర్యాలీలు, ఇంటింటి ప్రచారానికి ఎన్ని కల రిటర్నింగ్ అధికారి నుంచి తప్పని సరిగా అనుమతి తీసుకోవలసి ఉందన్నారు. సువిధ పోర్టల్ ద్వారా అనుమతి తీసుకోవచ్చని తెలిపారు. సమావేశంలో 17 గ్రామాల పరిధిలోని గ్రామ పంచాయతీశాఖకు చెందిన అన్ని విభాగాల ఉద్యోగులు హాజరయ్యారు.

### వలంటీర్ విధుల నుంచి తొలగింపు

వేమూరు, మార్చి 28: ఎన్నికల ప్రవర్తన నియమావళికి విరుద్ధంగా వ్యవహరించిన గ్రామ వలంటీర్‌ను విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. మంగళవారం రాత్రి చంపాడు గ్రామంలో వైసీపీ అభ్యర్థి వరికూటి అశోక్ బాబు నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో గ్రామ వలంటీర్ పీకా సన్నీడియోల్ పాల్గొన్నారు. ఈ సమాచారం దినపత్రికల్లో రావడంతో ఎంపీడీవో స్పందించారు. గురువారం దీనిపై విచారణ జరిపి వాస్తవ నివేదికను సేకరించి వలంటీర్‌ను విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

### పెనుమర్రులో తొలగించని వైసీపీ బోర్డులు

వేమూరు, మార్చి 28 : మండలంలోని పెనుమర్రు గ్రామం లో ఉన్న పలు రకాల వైసీపీ బోర్డులను తొలగించలేదు. అధికారులు నిర్లక్ష్య వైఖరితో గ్రామంలో ఇండ్లపైన, రోడ్డు మార్గంలో ఉన్న ప్రచార బోర్డులను తొలగించకపోవడంతో ప్రతిపక్షాల నేత లు విమర్శిస్తున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పూర్తిగా తుంగలో తొక్కారని ఉన్నతాధికారుల పర్యవేక్షణ కూడా కరువైందని వాపోతున్నారు.


పెనుమర్రులో ఇంటి గోడపై, తొలగించని ప్రచార బోర్డులు

### ఎన్నికల నియమావళిపై బీఎల్‌వోలతో సమావేశం

కొల్లూరు, మార్చి 28 : ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై బూత్ లెవల్ అధికారులతో తహసీల్దార్ పుల్లారావు, ఎంపీడీవో బీఎం లక్ష్మీకుమారి సమావేశం నిర్వహించారు. గురువారం స్థానిక మండలపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీ డీవో ఎన్నికల ప్రవర్తనా నియామవళిపై బీఎల్‌వోలకు అవగాహ న కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్, ఎంపీడీవోలు మాట్లాడుతూ ప్రతిరోజూ మీ గ్రామాల పరిధిలో ఎన్నికల కోడ్ సక్రమంగా అమలయ్యేలా చూసుకోవాలని ఆయా నివేదికలను అందిస్తూ ఉన్నతాధికారులకు పంపాలని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరూ ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా, వ్యతిరేకంగా మాట్లాడటం, సమావేశాలు, సభల్లో పాల్గొనకూడదని సూచించారు. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులు వస్తే ఆయా అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. వలంటీర్లు కూడా రాజకీయ పార్టీలకు దూ రంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ రవిబాబు, అడ్మినిస్ట్రేషన్ అధికారి సోమయాజులు, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

### సత్యసాయి సమితి ఆధ్వర్యంలో నేత్ర వైద్యశిబిరం

భట్టిప్రోలు, మార్చి 28 : సత్యసాయి భగవానుని సేవాసమితి పెదలంక సమితి ఆధ్వర్యంలో మండలంలోని సూరేపల్లి పంచాయతీ వేమవరంలో గురువారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఫోకస్ హాస్పిట ల్ ఆధ్వర్యంలో వైద్యులు 56 మందిని పరీక్షించి నేత్ర సంబంధిత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు చేశారు. జిల్లా బాలవికాస్ కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, జిల్లా సేవాదళ్ కోఆర్డినేటర్ గోవర్ధనరావు, జిల్లా ఆధ్యాత్మిక కోఆర్డినేటర్ నారాయణ మూర్తి, జిల్లా సీడీడీ కో ఆర్డినేటర్ అన్నె రవికుమార్, పెదలంక సమితి కన్వీనర్ బసవపూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

### దుండివారిపాలెంలో కోన వెంకట్ ప్రచారం

కర్లపాలెం, మార్చి 28 : మండలంలోని దుండివారిపాలెం పంచాయతీ కోన ప్రభాకరరావు కాలనీలో ఎమ్మెల్యే కోన రఘుపతి తరుపున ప్రముఖ సినీరచయత కోన వెంకట్ గురువారం ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ సీతారామిరెడ్డి, మండల కన్వీనర్ ఏడుకొండలు, ఉపాధ్యక్షుడు పందరబోయన సుబ్బారావు, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

» ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

» పార్టీలో చేరిన యువకులు

మార్టూరు, మార్చి 28: రాష్ట్ర అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యపడుతుందని ఆపార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. గురువారం సాయంత్రం మార్టూరులోని తూర్పుబజారున ఉన్న వినాయక స్వామిని దర్శించుకున్నారు. రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన అంతం కావాలని స్వామి వారిని ప్రార్థించినట్లు చెప్పారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో తూర్పుబజారుకు చెందిన వైసీపీకి చెందిన సీనియర్ నేత కొనకంచి మురళి తన అనుచరులతో ఏలూరి సమక్షంలో పార్టీలో చేరారు. వారందరికి ఏలూరి పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. పార్టీలో చేరినవారిలో రొంపిచర్ల గోపు వెంకట్రావు, సత్తెనపల్లి పరశురాం, తానికొండ గంగయ్య, కొల్లా బ్రహ్మం, తొండెపు శ్రీను, కొనకంచి సాంబయ్య , పొట్రు శ్రీను ఉన్నారు. అలాగే, విజయనగర్ కాలనీకి చెందిన కొమెర వెంకట్రావు, కొమ్మెర అంకమ్మ రావు, కొమ్మెర ప్రభాస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కమ్మ శివనాగేశ్వరరావు, తాటి నాగేశ్వరరావు, తొండెపు ఆదినారాయణ, కాకోలు వెంకటేశ్వర్లు, తొట్టెంపూడి భుజంగరావు, జంపని సాంబశివరావు, శానంపూడి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

### పర్చూరులో తెలుగుతమ్ముళ్ల ప్రచారం



పర్చూరులో ఎన్నికల ప్రచారంలో తెలుగు తమ్ముళ్ళు

పర్చూరు, మార్చి 28: పర్చూరులో తెలుగుదేశం పార్టీ గురువారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించింది. పర్చూరు గ్రామ దేవత శ్రీఅద్దంకి నాంచారమ్మ అమ్మవారి దేవస్థానంలో పూజాకార్యక్రమాలు నిర్వహించిన అనంతరం పార్టీ శ్రేణులు ప్రచారాన్ని ప్రారంభించారు. తొలిరోజే పెద్ద ఎత్తున మహిళలు, పార్టీ శ్రేణులు తరలిరావటంతో పార్టీలో నూతన ఉత్సాహం నెలకొంది. ఇంటింట తిరిగి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ, తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కోరుతూ ముందుకు సాగారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, పట్టణ అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, కొల్లా శివరాంప్రసాద్, కొండ్రగుంటి సుబ్బారావు, మామిడిపాక హరిప్రసాద్, తంగెళ్ళ మల్లిఖార్జునరావు, కొండ్రగుంటి శివనాగేశ్వరరావు, ఆకుల మధుబాబు, దూళిపల్లి వెంకటస్వామి, గడ్డిపాటి శ్రీనివాసరావు, బత్తుల సాంబశివరావు, మక్కెన శేఖర్‌బాబు, లక్కిపోగు సుమన్, చెరుకూరి శ్రీధర్ (చింపయ్య), శ్రీరాం వెంకటసుబ్బారావు, ఊటుకూరి నిర్మల, తులసి కోటేశ్వరమ్మ, కొల్లా సుబ్బాయమ్మ, శివాలశెట్టి రమాదేవి, పఠాన్ బాజీ, షేక్ బషీర్, కట్టెంపూడి జీవన్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరిన తూర్పు బజారు, విజయనగర్ కాలనీ యువకులు

### అరాచక పాలనకు చరమగీతం పాడాలి

పర్చూరు, మార్చి 28: అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధం కావాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిలుపునిచ్చారు. గురువారం క్యాంపు కార్యాలయంలో కారంచేడు నేతలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులంతా కలసికట్టుగా పార్టీ విజయం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని జగన్‌రెడ్డి అప్పులపాలు చేశారని అన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన చేతులు కలిపింది వ్యక్తిగత ప్రయోజనాలకోసం కాదని, రాష్ట్ర భవిష్యత్ కోసం మాత్రమేనన్నారు. దివాళా తీసిన రాష్ట్రానికి జవసత్వాలు అందించాలనే లక్ష్యంతో మూడు పార్టీలు జత కట్టాయని వివరించారు. ఈసందర్భంగా తెలుగుదేశం పార్టీలోకి చేరిన వారికి ఎమ్మెల్యే ఏలూరి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.



గుండ్లకమ్మ నదిలో జరుగుతన్న ఇసుక తవ్వకాలు(ఫైల్)

# ఇసుక సమస్య మళ్లీ మొదటికి..

» నిలిచిన రవాణా

» ఎన్నికల కోడ్ వ చ్చిన తరువాత పెరిగిన మైనింగ్ అధికారుల తనిఖీలు

» ఇప్పటివరకు అంతా అనధికారమేనా!

» వైసీపీ నేతల జేబులలోకి వెళ్లాయేమోనన్న అనుమానాలు

అద్దంకి, మార్చి 28: ఎన్నిక కోడ్ వచ్చిన తరువాత అద్దంకి ప్రాంతంలో ఇసుక రవాణాపై మైనింగ్ అధికారుల తనిఖీలు పెరిగాయి. దీంతో ఇసుక రవాణా పూర్తిగా నిలిచింది. దీనినిబట్టి ఇప్పటివరకు ఎలాంటి అనుమతులు లేకుండానే తవ్వకాలు జరిగాయన్న అనుమానాలకు మరింత బలం చేకూరింది. గుండ్లకమ్మ నదిలో అద్దంకి ప్రాంతంలో ఇసుక తవ్వకాలకు ఎలాంటి రీచ్‌ను అధికారికంగా గుర్తించలేదని గతంలో మైనిగ్ అధికారులు ప్రకటించారు. అయితే, క్షేత్రస్థాయిలో ఇసుక తవ్వకాలు అడ్డుకున్న దాఖలాలు లేవు. దీనివెనుక రాష్ట్ర స్థాయిలో సీనరేజ్ దక్కించుకున్న సంస్థకు అధికార పార్టీ అండదండలు పుష్కలంగా ఉండటంతో పాటు స్థానిక అధికార పార్టీ నేతలకు వాటాలు అందటమేనన్న అనుమా నాలు వ్యక్తమవుతున్నాయి.

ఈనేపథ్యంలో ఎన్నికల కోడ్ రావటంతో మైనింగ్ అధికారులు అప్రమత్తమై తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తుంది. దీంతో అనధికారికంగా సీనరేజ్ వసూలు చేసిన వ్యక్తులు జారుకున్నట్లు సమాచారం. మైనింగ్ అధికారులతో పాటు ఎస్ఈబీ అధికారులు కూడా తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో అవకాశం దొరికినప్పుడల్లా ఎస్ఈబీ అధికారులు త నిఖీల పేరుతో వసూళ్లకు తెర లేపినట్లు విమర్శలు వస్తున్నాయి. మణికేశ్వరం వద్ద గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో ఇటీవల ఇసుక దందా జోరుగా సాగగా, ప్రస్తుతం అక్కడ కూడా ఇసుక రవాణా నిలిపివేశారు. దీంతో ఇసుక అక్రమ రవాణాదారులకు నోట్లో ఎలక్కాయ పడినట్లయింది. అయితే, ఇసుక రవాణా నిలిచిపోవటంతో భవననిర్మాణ దారులకు ఇక్కట్లు మొదలయ్యాయి.

### శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠినచర్యలు



గుంటుపల్లిలో జరిగిన పోలీసు కవాతులో పాల్గొన్న సీఐ నరసింహారావు

బల్లికురవ, మార్చి 28: సార్వత్రిక ఎన్నికలలో శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తప్పవని సంతమాగులూరు సర్కిల్ సీఐ నరసింహారావు హెచ్చరించారు. గురువారం మండలంలోని గుంటుపల్లి, కొత్తపాలెం గ్రామాలలో ప్రత్యేక బలగాలతో పోలీసు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేలా కొన్ని నిబంధనలు అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికే హింసాత్మక గ్రామాలను గుర్తించి ప్రత్యేక నిఘా పెంచామన్నారు. గ్రామాలలో మద్యం అమ్మకాలు చేపట్టినా, జూదం నిర్వహించినా, కొత్త వ్యక్తులు సంచరించినా వెంటనే పోలీసు శాఖకు ఫిర్యాదు చేయాలన్నారు. అలాగే, గతంలో ఘర్షణలకు పాల్పడిన వారిపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. రౌడీషీటర్లు కదలికలపై నిఘా ఉందని, ఎవరైన చట్టాన్ని ఉల్లంఘనలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

### అద్దంకిలో తనిఖీలు ముమ్మరం



అద్దంకి పట్టణంలోని రామ్‌నగర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారుల బృందం

అద్దంకి, మార్చి 28: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నగదు పంపిణీ అరికట్టేందుకు చేపట్టిన తనిఖీలు ముమ్మరం చేశారు. అద్దంకి పట్టణంలోని భవానిసెంటర్‌లో ప్రత్యేకంగా పోలీస్ చెక్‌పోస్టు ఏర్పాటుచేసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. పట్టణ పరిధిలోని పలు ప్రాంతాలలో గురువారం మున్సిపల్ మేనేజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో బృందం రామ్‌నగర్‌తో పాటు ఇతర ప్రాంతాలలో వాహనాలు తనిఖీ చేపట్టారు. దీంతో ఇతర అవసరాల కోసం నగదు తీసుకెళ్లే వ్యక్తులు సైతం ఆందోళన చెందుతున్నారు. ఓటింగ్‌కు సుమారు 45 రోజులు సమయం ఉండటంతో ఇన్ని రోజుల పాటు నగదు లావాదేవీలు జరగకుండా ఎలా అని పలువురు వ్యాపారులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

### ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



మాట్లాడుతున్న ఆర్వో రవీందర్

పర్చూరు, మార్చి 28: ఎన్నికల నిర్వహణలో బ్యాంక్ అధికారులు సహకారం అందించాలని పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రెవెన్యూ డివిజన్ అధికారి గంధం రవీందర్ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బ్యాంకు అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో 40 వరకు బ్యాంకులు ఉన్నాయని, సిబ్బందికి ఎన్నికల డ్యూటీలు వస్తాయన్నారు. మైక్రో అబ్జర్వర్‌కు ఇచ్చే చెక్‌లిస్ట్‌పైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, బ్యాంకు లావాదేవీలపై ఆదాయపన్ను శాఖ ఆధ్వర్యంలో పరిశీలన చేస్తారని చెప్పారు. సమావేశంలో తహసీల్దార్‌లు సీహెచ్ సుబ్బయ్య, కె.సంధ్యశ్రీ, మెహర్ బాబు, డిప్యూటీ తహసీల్దార్ పి.సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



# కూటమితోనే రాష్ట్రానికి జవసత్వాలు

» ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, మార్చి 28: వైసీపీ ప్రభుత్వ పాలనలో దివాళా తీసిన రాష్ట్రానికి జవసత్వాలు అందించాలన్న లక్ష్యంతో టీడీపీ, జనసేన, బీజేపీలు కూటమిగా ఏర్పడ్డాయని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి మండలంలోని ధేనువకొండ, పేరాయపాలెం, మోదేపల్లి, కుంకుపాడు, కొటికలపూడి, తిమ్మాయపాలెం, రామాయపాలెం, వేలమూరిపాడు, కొంగపాడు, మణికేశ్వరం, విప్పర్లవారిపాలెం, నాగులపాడు, జార్లపాలెం, చెరువుకొమ్మపాలెం, బొమ్మనంపాడు, ఉప్పలపాడు, గోవాడ త దితర గ్రామాల నేతలతో గురువారం పంగులూరు మండలం ముప్పవరం వద్ద ఉన్న క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. గుండ్లకమ్మ ముంపు గ్రామాలు, పునరావాస కాలనీల ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. పేదవాడి కడుపు నింపే అన్నా క్యాంటీన్‌లు తెరిపిస్తామన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. టీడీపీ చేపట్టిన ప్రజాగళంతో వైసీపీ బంగాళాఖాతంలో కలిసి పోవటం ఖాయమన్నారు.

కార్యక్రమంలో టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, కరి పరమేష్, జొన్నలగొడ్డ గోపి, నర్రా వీరయ్య, గాలం శ్రీనావాసరావు, పూనాటి విక్రమ్, కంచర్ల వెంకటరావు, జ్యోతి రామారావు, మోటుపల్లి నాగేశ్వరరావు, దివికోలు రాధాకృష్ణమూర్తి, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరిన గుడిపూడి బ్రహ్మయ్య, తదితరులు



గ్రామాల నేతలతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

### టీడీపీలో కొంగపాడు సర్పంచ్ వర్గీయుల చేరిక

అద్దంకి, మార్చి 28: మండలంలోని కొంగపాడు సర్పంచ్ గుడిపూడి రమాదే వి బ్రహ్మయ్యతో పాటు పలువురు గురువారం ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. సర్పంచ్ భర్త బ్రహ్మయ్య, కరి సుబ్బారావు, నర్రా వెంకటేశ్వర్లు, అనపర్తి సుబ్బారావు, మాచవరపు శ్రీనివాసరావుతో పాటు పలువురు టీడీపీలో చేరారు. తెలుగుదేశం పార్టీకి గ్రామలో మరింత మెజార్టీ వచ్చే విధంగా కృషి చేస్తామని ఈ సందర్భంగా రవికుమార్ కు తెలిపారు.

# చెక్‌పోస్టు డ్యూటీకి బల్లికురవ ఎస్ఐ నాగశివారెడ్డి అటాచ్

» వరుస ఫిర్యాదులు రావటంతో ఎస్పీ ఆదేశాలు





నాగశివారెడ్డి (ఫైల్)

బల్లికురవ, మార్చి 28: గత పది రోజుల నుంచి పలురకాల ఆరోపణలు ఎదుర్కొంటున్న బల్లికురవ ఎస్ఐ నాగశివారెడ్డిని ఎట్టకేలకు ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు పర్చూరు సమీపంలోని అన్నంబొట్లవారిపాలెం ఎన్నికల తనిఖీ చెక్ పోస్టుకు అటాచ్ చేశారు. గురువారం ఎస్ఐ నాగశివారెడ్డి బల్లికురవ స్టేషన్ విధుల నుంచి తప్పుకొన్నారు. స్టేషన్ ఫోను సిమ్ కార్డును రైటర్‌కు అందించారు. బల్లికురవ గ్రామానికి చెందిన వృద్ధుడు శానంపూడి హనుమంతరావుపై ఎస్ఐ దాడి చేయటంతో పాటు ఆయనపై అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్నట్లు కేసు నమోదు చేశారు. దీనిపై వృద్ధుడు ఎస్ఐపై ఫిర్యాదు చేశారు. అలాగే, స్టేషన్‌లో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా కొమ్మినేనివారిపాలెంకు చెందిన వైసీపీ నేతతో ఎస్ఐ నాగశివారెడ్డి సన్మానం చేయించుకొన్నారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపారు. అలాగే, ఉప్పుమాగులూరు గ్రామానికి చెందిన టీడీపీ నేతలపై అక్రమంగా హత్యాయత్నం కేసులు నమోదు చేయగా వారు జిల్లా ఎస్పీకి ఫిర్యాదులు చేశారు. ఎస్ఐ పనితీరు సరిగా లేదని, వైసీపీకి అనుకూలంగా పనిచేస్తున్నారని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్ఐపై వరుస ఫిర్యాదులు రావటంతో ఎస్పీ వకుల్ జిందాల్ పూర్తిస్థాయిలో విచారణ జరిపి వెంటనే విధుల నుంచి తప్పిస్తూ అన్నంబొట్లవారిపాలెం వద్ద ఉన్న ఎన్నికల తనిఖీ చెక్‌పోస్టుకు అటాచ్ చేశారు. బల్లికురవకు సంతమాగులూరు స్టేషన్ ఎస్ఐ సురేష్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. సీఐ నరసింహారావు పర్యవేక్షణ చేయాలని ఉత్తర్వులు ఇచ్చిన్నట్లు తెలుస్తుంది.

# జాగర్లమూడివారిపాలెంలో ఆధ్యాత్మిక శోభ

» వైభవంగా దేవతామూర్తుల ప్రతిష్ఠ

» వేలాదిగా తరలివచ్చిన భక్తులు



కొలువుదీరిన దేవతామూర్తులు

పంగులూరు, మార్చి 28: మండలంలోని జాగర్లమూడివారిపాలెంలో గురువారం శ్రీహనమత్ సీతాలక్ష్మణ సపరివార సహిత శ్రీకోదండ రామచంద్రస్వామి జీవధ్వజ విమాన శిఖర ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. గ్రామంలో కోట్లాది రూపాయలు వెచ్చించి సర్వాంగ సుందరంగా నిర్మించిన శ్రీకోదండ రామచంద్రస్వామి ఆలయంలో ప్రముఖ వేద పండితులు, శతాధిక ప్రతిష్ఠాపనాచార్య రొంపిచర్ల వెంకట సత్యనారాయణాచార్యులు శాస్త్రోక్తంగా ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించారు. ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు జాగర్లమూడివారిపాలెం పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలిరావడంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.





పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్, మాజీ ఎమ్మెల్యే గరటయ్య, కృష్ణచైతన్య

శ్రీకోదండరామచంద్రస్వామి ప్రతిష్ఠ మహోత్సవంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, జడ్పీ మాజీ చైర్మన్ ఈదర హరిబాబు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాచిన చెంచుగరటయ్య, కృష్ణ చైతన్యలు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయకమిటీ వీరిని ఘనంగా సత్కరించారు. వేలాది మందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు, సర్పంచ్ జాగర్లమూడి వెంకటరత్నం, యలమందరావు. ధూళిపాళ్ళ వీరనారాయణ, జాగర్లమూడి వెంకటరావు, జనార్దన్, మోహనరావు, జాగర్లమూడి నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, కేతిన సత్యనారాయణ, ధూళిపాళ్ళ సుబ్బారావు, వెంకటేశ్వర్లు, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

అనంతరం స్వామి వారి శాంతి కల్యాణం జరిపించారు. పదిమందికి పైగా దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు సుబ్బారావు, అప్పారావులు పూజా కార్యక్రమాలను, స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు సకల ఆంజనేయులు ఆధ్వర్యంలో సభ్యులు ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేశారు. కల్యాణం అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భారీగా అన్నదానం నిర్వహించారు.

### వైభవంగా బాలాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

వేటపాలెం(చీరాల), మార్చి 28: వేటపాలెం మండలం పాపాయిపాలెం గ్రామంలో గురువారం బాలాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. శాస్త్రోక్తంగా వేదపండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య, ఆయన కుమారుడు గౌరీ అమర్‌నాథ్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే, ప్రత్యేక పూజల్లో వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేష్, ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పాల్గొన్నారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహకులు తగిన ఏర్పాట్లుచేశారు.



పూజల్లో పాల్గొన్న కూటమి అభ్యర్థి కొండయ్య, గౌరీఅమర్‌నాథ్



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కరణం బలరాం, వైసీపీ అభ్యర్థి వెంకటేష్

### మార్టూరులో పాండురంగస్వామి కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న దంపతులు

మార్టూరు, మార్చి 28: మార్టూరులోని పడమర బజారు ఆలయంలో శ్రీరుక్మా బాయి సమేత పాండురంగస్వామి శాంతి కల్యాణం గురువారం వైభవంగా జరిగింది. వేకువజాము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవ స్థానం 9వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో వేదమంత్రాలతో అభిషేకం, హోమం, పూజలు నిర్వహించారు.

## బార్ అసోసియేషన్ కార్యవర్గం



హ జరత్తయ్య



జబ్బార్

అద్దంకి, మార్చి28: అద్దంకి బార్ అసోసియేషన్ ఎన్నిక గురువారం జరిగింది. అధ్యక్షుడుగా రావి హజరత్తయ్య వైస్ ప్రెసిడెంట్‌గా శానం నాగేశ్వరరావు, కార్యదర్శిగా జబ్బర్, జాయింట్ సెక్రటరీగా సత్యవతి, ట్రెజరర్‌గా హరిబాబు, మహిళా ప్రతినిధిగా కుసుమలతతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. బార్ అసోసియేషన్ ఎన్నిక ప్రక్రియను న్యా యవాది ఉదయభాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని పలువురు న్యాయవాదులు అభినందించారు.

## ప్రత్యేకావసరాల చిన్నారులకు భవిత కేంద్రాలు ఓ వరం

అద్దంకిటౌన్, మార్చి 28: ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు భవిత విద్యావనరుల కేంద్రాలు ఒక వరం లాంటివని సహిత విద్యా జిల్లా సమన్వయకర్త ఎం.జ్యోత్స్న అన్నారు. వీటిని చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగపర్చుకోవాలని కోరారు. గురువారం అద్దంకిలోని సత్రం బడి ఆవరణంలో ఉన్న భవిత విద్యావనరుల కేంద్రంలో రాష్ట్ర సమగ్ర శిక్ష ఆదేశాల మేరకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జ్యోత్స్న మాట్లాడుతూ అద్దంకి నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ఉచిత ఉపకరణాల నిర్ధారణ వైద్య పరీక్షలలో 201 మంది చిన్నారులను అర్హులుగా గుర్తించినట్లు చెప్పారు. త్వరలో వీరందరికి ఉపకరణాలు అందజేస్తామన్నారు. శిబిరంలో ఎస్.నివేదిత, జి.లాస్య యాదవ్, టి.నాగకోటేశ్వరరావు, కె.చైతన్య, ఇందిరాప్రియదర్శినిలు చిన్నారులకు వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవోలు డి.గంగాధరరావు, బి.సుధాకరరావు, హెచ్ఎం ఇట్టా రామారావు, ఐఈఆర్టీలు కొంగల శ్రీనివాసు, పాలపర్తి యోనా, రమణారెడ్డి, బాబురావు, గంగాదర్, కోండయ్య ఫిలిప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

బల్లికురవ, మార్చి 28: లైంగిక వేధింపులకు పాల్పడటంతో పాటు దాడికి పాల్పడిన కొప్పెరపాలెంకు చెందిన వల్లెపు నాగేశ్వరరావు అనే వ్యక్తిని గురు వారం అరెస్టు చేసిన్నట్లు ఇన్‌చార్జ్ ఎస్ఐ సురేష్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. గ్రామానికి చెందిన వివాహితను ఈనెల 24న నాగేశ్వరరావు రాత్రి సమయంలో ఇంట్లోకి వెళ్లి అత్యాచార యత్నం చేయటంతో పాటు కత్తితో దాడి చేశాడు. దీంతో గాయపడిన ఆమె ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు వెళ్లి అక్కడనుంచి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. నిందితుడిని అరెస్టు చేసి అద్దంకి కోర్టులో హాజరు పరిచినట్లు సురేష్ తెలిపారు.

## పది క్వింటాళ్ల ఎండు మిర్చి చోరీ

బల్లికురవ, మార్చి 28: మండలంలోని కొప్పెరపాలెం గ్రామంలో వల్లెపు శ్రీను అనే రైతుకు చెందిన పంట పొలంలో పది క్వింటాళ్ల మిర్చి బుధవారం రాత్రి చోరీ అయ్యాయి. సంతమాగులూరు మండలం కొప్పరంకు చెందిన వల్లెపు శ్రీను అనే రైతు బల్లికురవ మండలం కొప్పెరపాలెంలో కౌలుకు తీసుకొని మిర్చి పంట సాగు చేశాడు. కోత కోసిన మిర్చి పంట పొలంలో ఎండటానికి ఉంచగా గుర్తు తెలియని దొంగలు సుమారు పది క్వింటాళ్ల మిర్చిని తస్కరించారు. గురువారం పొలం వద్దకు వచ్చిన రైతు మిర్చి చోరీ జరిగిన విషయం గుర్తించి వెంటనే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

## నేడు గ్రామాలవారీగా నేతలతో గొట్టిపాటి సమీక్ష

పంగులూరు, మార్చి 28: మండలంలోని పలుగ్రామాల టీడీపీ నేతలతో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం సమీక్ష నిర్వహించనున్నారు. ముప్పవరంలోని పార్టీ కార్యాలయంలో జాగర్లమూడివారిపాలెం, అలవలపాడు, తక్కెళ్ళపాడు, నూజెళ్ళపళ్ళి, చినమల్లవరం, కొండమూరు గ్రామాల నేతలతో రవికుమార్ సమీక్ష నిర్వహించనున్నారని క్యాంపు కార్యాలయ ప్రతినిధి తెలిపారు. ఈ సమీక్షకు ఆయాగ్రామాల తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, బూత్ ఇన్‌చార్జ్‌లు, బూత్ ఏజంట్లు, పేజీ నేస్తం సభ్యులు హాజరుకావాలని కోరారు.

## నేడు టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

చినగంజాం, మార్చి 28: స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆపార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యకర్శులు పొద వీరయ్య, అబ్దుల్‌కలాం అజాద్‌లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 42వ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరణతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వీరయ్య తెలిపారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలో మండల పరిధిలోని నాయకులు, కార్యకర్తలు, పార్టీ కుటుంబసభ్యులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు

## 80 మద్యం బాటిళ్లు స్వాధీనం

మార్టూరు, మార్చి 28: మద్యం అక్రమంగా అమ్ముతున్న ఓవ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని 80 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొన్నారు. గురువారం మధ్యాహ్నం కొణిదెన రోడ్డులో ఈ సంఘటన చోటుచేసుకుంది. మండలంలోని రాజుపాలెంకు చెందిన బాలకృష్ణ మద్యాన్ని అనధికారికంగా అధిక ధరలకు అమ్ముతుంటారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతో కొణిదెన రోడ్డులో పోలీసులు కాపుకాసి అతనిని అదుపులోకి తీసుకున్నారు. అతని స్కూటీలో 30 బాటిళ్లు, ఇతర ప్రదేశంలో 50 బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసకొని స్టేషన్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్ల విలువ రూ.13,060 ఉంటుందని స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. తనిఖీలలో ఏఎస్ఐలు సైదా, మహబూబ్ బాషా, హెడ్ కానిస్టేబుల్ గరుత్మంతుడు, కానిస్టేబుల్ జె.రమేష్ పాల్గొన్నారు.

## పలు గ్రామాలలో కవాతు

అద్దంకి, మార్చి 28: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని మైలవరం, ఉప్పలపాడు, వెంపరాల, చక్రాయపాలెంలో గురువారం సాయంత్రం పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ కృష్ణయ్య మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటుహక్కును నిర్భయంగా ప్రలోభాలకు లోనుకాకుండా వినియోగించుకోవడానికి ప్రజలకు పోలీసులు అండగా ఉంటారన్నారు. ఎస్సై లు నాగరాజు, రత్నకుమారి, బిఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

కాగా, పోగొట్టుకున్న వ్యక్తులకు మూడు సెల్‌ఫోన్‌లను సీఐ కృష్ణయ్య గురువారం అందజేశారు. ఇటీవల అద్దంకి పట్టణానికి చెందిన సీహెచ్ శ్రీనివాసరావు, వెస్ట్ నాయుడుపాలెంకు చెందిన షేక్ మస్తాన్, గొర్రెపాడుకు చెందిన కోటేశ్వరరావులు వివిధ పనుల నిమిత్తం వచ్చి ఇటీవల అద్దంకి పట్టణంలో సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో సెల్‌ఫోన్‌లు గుర్తించి గురువారం అందజేశారు. సెల్‌ఫోన్‌లు రికవరీలో చురుకుగా పనిచేసిన ఉయ్యాల బ్రహ్మయ్యను సీఐ కృష్ణయ్య అభినందించారు.

## ఆహార పదార్థాల కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు

వేటపాలెం(చీరాల), మార్చి 28: విక్రయదారులు ఎవరైనా ఆహార పదార్థాల కల్తీకి పాల్పడితే కఠినచర్యలు తప్పవని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ప్రణీత్‌కుమార్ చెప్పారు. గురువారం స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వ్యాపారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆహార భద్రత చట్టాలపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ శిక్షకుడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ ఈవో సస్పెన్షన్

చీరాల, మార్చి 28 : వేటపాలెం మండలం కనకనాగవరపమ్మ అమ్మవారి దేవస్థానం ఈవో జీవీఎల్ కుమార్‌ను గురువారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ మహేశ్వరరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చీరాల సత్రం ఖాతాకు సంబంబంధించి రూ.32 లక్షలు అనధికారికంగా డ్రా చేసినట్లు నేరెళ్ల గోపాల్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు విచారణ జరపగా నిధులు డ్రా చేసినట్లు ధ్రువీకరణ కావటంతో కుమార్‌ను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిపారు.

## పేకాట శిబిరంపై పోలీసులు మెరుపుదాడి

» 8 మంది అరెస్ట్, రూ.2,21,400 నగదు స్వాధీనం

పర్చూరు, మార్చి 28: పేకాట శిబిరంపై బాపట్ల జిల్లా పోలీసులు మెరుపుదాడి చేశారు. పర్చూరు మండలం వీరన్నపాలెం - రమణాయపాలెం రోడ్డులోని నల్లగుంట డొంక వద్ద పేకాల స్థావరంపై గురువారం మధ్యాహ్నం మెరుపు దాడిచేసి భారీ మొత్తంలో నగదు సీజ్ చేశారు. ఎస్పీ వకుల్ జిందాల్‌కు అందిన సమాచారం మేరకు ఆయన ఆదేశాలతో.. డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ, బాపట్ల రూరల్ సీఐ శ్రీహరి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం, పర్చూరు ఎస్సై ఎస్.రమేష్ ఆధ్వర్యంలో మరో బృందాన్ని ఏర్పాటుచేసి ఏకకాలంతో దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో పేకాట ఆడుతున్న 18 మందిని అరెస్ట్‌చేసి వారి నుంచి రూ.2,21,400 నగదుతోపాటు, 9 ద్విచక్ర వాహనాలు, 18 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

ఇందుకుసంబంధించి ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ పర్చూరు ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు ముందస్తు సమాచారం మేరకు ప్రత్యేక పోలీసు బృందాలతో మెరుపు దాడి చేసినట్లు చెప్పారు. ఈసందర్భంగా పోలీసు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.